ప్రజా తపన
prajathapana.com
News that matters



సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద

సంపుటి :01 సంచిక: 183 బుధవారం 30 ఆగస్ట్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-

# గ్యాస్ బండ ధర తగ్గిస్తోన్న కేంద్రం

**ఢిల్లీ, ఆగస్టు 29, (న్యూస్ పల్స్)**



సామాన్యుడికి గుడ్‌న్యూస్! మహిళలకు రాఖీ గిఫ్ట్! కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించింది. ఒక్కో సిలిండర్‌పై రూ.200 వరకు కత్తిరించింది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పరిధిలోని వారికి రూ.400 వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపింది. ఇతరులకు రూ.200 వరకు ఆదా అవ్వనుంది. ప్రస్తుత తగ్గింపుతో కేంద్ర ప్రభుత్వానికి 2022-23లో రూ.6100 కోట్లు, 2023-24లో రూ.7680 కోట్ల భారం పడుతుందని అంచనా.

'రాఖీ పండుగ, ఓనమ్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గించింది. ఉజ్వల యోజన కింద రూ.200 అదనపు సిబ్సిడీని పొడగించింది. దాంతో 73 లక్షల మహిళలకు ప్రయోజనం కలగనుంది' అని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అంతేకాకుండా ఉజ్వల స్కీమ్ కింద మరో 75 లక్షల కొత్త కనెక్షన్లు ఇస్తామని వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించడానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఐదు రాష్ట్రాల ఎన్నికల కోలాహలం మొదలవుతుంది. ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వస్తుంది. ద్రవ్యోల్బణం పెరుగుదల, ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. దాంతో మోదీ సర్కార్ ఈ చర్యలు తీసుకుంది. అంతేకాకుండా కొన్ని నెలలుగా రష్యా నుంచి అతి తక్కువ ధరకే క్రూడాయిల్ కొనుగోలు చేస్తోంది.

మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 90-100 డాలర్లు పలుకుతుండగా రష్యా నుంచి 70 డాలర్లకే దిగుమతి

02

# టైట్ షెడ్యూల్ లో జనసేనాని

**సగం రోజులు యాత్ర.. సగం రోజులు సినిమాలు..**

**విశాఖపట్టణం, ఆగస్టు 29,**



పవన్ కల్యాణ్ వారాహి విజయయాత్ర ద్వారా పార్టీ నేతలు, కేడర్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. అయితే వారాహి యాత్ర ప్రారంభం అయిన తర్వాత మొదటి మూడు విడతల యాత్రలకు మధ్యలో పెద్దగా గ్యాప్ తీసుకోలేదు. కేవలం బ్రో సినిమా రిలీజ్ సమయంలో మాత్రం కాస్త విరామం తీసుకున్నారు. కానీ ప్రస్తుతం పవన్ చేస్తున్న సినిమా ప్రాజెక్టులతో అటు యాత్రకు ఇటు సినిమాలకు ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. సెప్టెంబర్ 2వ తేదీ పవన్ కల్యాణ్ పుట్టినరోజు ఉంది. అప్పటినుంచి పన్నెండో తేదీ వరకూ షూటింగ్‌లోనే ఉంటారని తెలిసింది. ఇక సెప్టెంబర్ మూడో వారం నుంచి నాలుగో విడత వారాహి యాత్ర ప్రారంభమయ్యే ఛాన్స్ ఉందంటున్నారు. దానికి తగ్గట్లుగా రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. డిసెంబర్ చివరి వరకూ పవన్ కళ్యాణ్ కు సినిమా షూటింగ్‌లు ఉన్నాయి.దీంతో ఈ నాలుగు నెలలు ప్రతి నెలా సగం రోజులు సినిమా షూటింగ్‌కు, మరో సగం రోజులు పార్టీకి కేటాయించేలా కసరత్తు చేస్తున్నారు. నెలలో సగం రోజులు పూర్తి స్థాయిలో పార్టీపై దృష్టి సారించనున్నట్లు పేర్కొంటున్నారు పార్టీ నేతలు.. ఇదే సమయంలో వారాహి యాత్రతో పాటు పార్టీ జాయినింగ్స్, నియోజకవర్గాల వారీగా సమీక్షలపైనా దృష్టి పెట్టేలా షెడ్యూల్ రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఇక జనవరి నుంచి సినిమాలకు పూర్తి దూరంగా ఉంటూ

02

# దేశ నిర్మాణంలో భాగం అవుతా



**- ఎలా అనేది కాలమే నిర్ణయిస్తుంది**

**చంద్రబాబు కీలక వ్యాఖ్యలు !**

**ఢిల్లీ, ఆగస్టు 29,**

దేశ నిర్మాణంలో భాగం అవుతానని అది ఎలా అనేది కాలమే నిర్ణయిస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన జాతీయ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 1980ల నుంచే టీడీపీ జాతీయ కూటమిల్లో భాగంగా ఉందని గుర్తు చేశారు. ఇండియా కూటమి ఎలా ముందుకు వెళ్తుందో చూడాల్సి ఉందన్నారు. ఇండియా కూటమికి లీడర్ లేకపోవడం బీజేపీ కి అనుకూల అంశమని.. ఇండియా కూటమికి నాయకత్వం ఎవరు వహిస్తారు అనేదానిపై కామెంట్ చేయనని స్పష్టం చేశారు.

ప్రపంచంలో భారత్‌కు గుర్తింపు తెచ్చిన మోదీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. మోడీ భారత్ కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారున్నారు. వాజ్ పెయి,మన్మోహన్ సింగ్ అంతగా అంతర్జాతీయ పర్యటనలు చేయలేదని గుర్తు చేసారు. భారత దేశం టెక్నాలజీలో చాలా అడ్వాన్స్ స్టేజ్ లో ఉంది. డీప్ డ్రైవ్ టెక్నాలజీస్ వినియోగంలోకి వస్తున్నాయి. వ్యవసాయం, హెల్త్ రంగాల్లో ఈ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు చూడొచ్చన్నారు. భారత్ లో అనంతమైన సౌర శక్తి ఉంది. సౌర, పవన విద్యుత్.. సహా భారత్ కి డెమోగ్రఫిక్ సానుకూలత చాలా ఎక్కువ ఉన్నాయన్నారు.

భారత్ కి యువ శక్తి ఉంది. దేశం

# ప్రపంచంలోనే అధిక కాలుష్యం నగరం ఢిల్లీ

**ప్రజల ఆయుష్షు 12 ఏళ్లు తగ్గిపోనున్నట్లు స్టడీ లో వెల్లడి**

**న్యూఢిల్లీ ఆగష్టు 29**



ప్రపంచంలోనే అత్యంత అధిక కాలుష్యంఉన్న నగరంగా ఢిల్లీ నమోదు అయ్యింది. ఇక ఆ నగరంలో నివసిస్తున్న ప్రజల ఆయుష్షు 12 ఏళ్లు తగ్గిపోనున్నట్లు స్టడీ పేర్కొన్నది. చికాగోలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్‌పై డేటాను రిలీజ్ చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సగటు

02



**మంత్రి రోజా భర్త సెల్వమణికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ.**


ఆంధ్రప్రదేశ్ మంత్రి రోజా భర్త సెల్వమణిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. 2016 నుంచి ఆయన్ను వెంటాడుతున్న ఈ కేసులో తాజాగా నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది కోర్టు. ముకుల్ చంద్ వల్ల తీవ్రంగా నష్ట పోయినట్టు 2016లో సెల్వమణి వ్యాఖ్యలు చేశారు. దాంతో సెల్వమణిపై పరువు నష్టం దావా కేసు వేశారు ఫైనాన్షియర్ ముకుల్ చంద్. ముకుల్ చంద్ బోత్రా చనిపోయినా.. ఆ కేసును కొనసాగిస్తున్నారు ఆయన కుమారుడు గగన్ బోత్రా. సోమవారం విచారణ కోర్టులో విచారణ ఉండగా.. సెల్వమణి కోర్టుకు హాజరుకాలేదు. దాంతో సెల్వమణిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది చెన్నై జార్జ్ టౌన్ కోర్ట్. తదుపరి విచారణ సెప్టెంబర్ 22 కు వాయిదా వేసింది.

మంత్రి నగరి రోజా భర్త వివాదంలో ఇరుక్కున్నాడు. ఒక టీవీ ఇంటర్వ్యూలో చేసిన వాఖ్యలు ఆయన మెడకు చుట్టుకున్నాయి.. ఒక ఫైనాన్షియర్

# అరుణాచల్‌ప్రదేశ్, ఆక్సాయ్ చిన్ మావే

**చైనా మ్యాప్ విడుదల**

**న్యూ ఢిల్లీ ఆగష్టు 29**



చైనా మరోసారి తన వక్రబుద్ధిని చాటుకున్నది. భారత్‌లో భాగమైన అరుణాచల్ ప్రదేశ్ ఆక్సాయ్ చిన్ తమ దేశంలో భాగమేనని తేల్చిచెప్పింది. ఆ రెండు ప్రాంతాలు తమవేనని పేర్కొటూ స్టాండర్డ్ మ్యాప్‌ను రూపొందించింది. చైనా న్యాచురల్ రిసోర్సెస్ రూపొందించిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌ను దక్షిణ

02

# తెలుగు వారసత్వ సంపాదనను భావితరాలకు అందించాలి

**ప్రజాతపన**




ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం మరియు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికారసంస్థ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు గారి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికీ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆర్ట్స్ %ండ% కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు ,విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్ ,ఆత్మీయ అతిథులుగా ఆచార్య జి యోహానుబాబు ,డా దామెర వెంకట సూర్యారావు .డా మీగడ రామలింగస్వామి ,శ్రీ పరవస్తు పణిశయన సూరి హాజరయ్యారు .ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు .గిడుగు లాంటి మహనీయుల త్యాగం తోనే ఆంధ్ర విశ్వకళాపరిషత్ లో మొదట తెలుగు విభాగం ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు .ప్రాచీన తెలుగు సాహిత్యం లో ఎన్నో అంశాలు ఉన్నాయని ఆనాటి కవులు ఉహాజనితమైన కధలు చెప్పినప్పటికీ అవి మానవజీవితానికి ఉపదేశాత్మకమైన నీతిప్రభోధం కల్గించేవన్నారు . ఈ నాటి సమాజం ఇది తెలుసుకోలేకపోతుందని ఇతర దేశస్థులు తెలుగు భాష మాధుర్యాన్ని గ్రహించి మన వారసత్వ సంపదను ఇతర దేశాలకు తరలించారన్నారు .తెలుగు భాషలో ఉన్న ఈ మాధుర్యాన్ని సామాన్య ప్రజల చెంతకు తీసుకురావటానికి గిడుగు ఏంతో కృషి చేసి అందులో విజయం సాధించారన్నారు. అయితే అయన చేసిన ప్రయత్నం వృధా ప్రయాస కాకుండా నేటి యువత ప్రాచీన గ్రంధాలతో పాటు ఆధునిక కావ్యాలు చదివి జీవితాన్ని చక్కదిద్దుకుంటూ తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆచార్య వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ మాతృభాష లో అనర్గళంగా మాట్లాడలేని వారు పరభాషలలో కూడా మాట్లాడలేరని ,మనం చదువుకి ఇచ్చే ప్రాధాన్యత కంటే భాషకుప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు .చాల మంది విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకున్నప్పటికీ భాష విషయం లో వెనుకబడుతున్నారని అందుకే ఏ భాషనైనా చక్కగా నేర్చుకున్నప్పుడే అభివృద్ధి లోకి వస్తారన్నారు తెలుగు భాషలో అమూల్యమైన గ్రంధాలు ఉన్నాయని అందులో మనకు మన జీవితానికి పనికి వచ్చే అంశాలను గ్రహించి ఇతర భాషల్లోకి తర్జుమా చేసి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలన్నారు . తెలుగు భాషాభివృద్ధి కి గిడుగు పాటుపడ్డట్టు ప్రతి ఒక్కరు కంకణదారులై మాతృ భాష మనుగడకు నడుం కట్టాలన్నారు .అన్యదదేశా పదజాలం మనభాషలో విరివిగా ప్రవేశించినప్పుడు భాష మృత భాషగా మారుతుందని అప్పుడు మన సంస్కృతి ఆనవాళ్లు కూడా కోల్పోతామని అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తెరిగి భాష కోసం పరితపించాలన్నారు .తెలుగు విభాగం తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించటం అభినందనీయమని ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెంపొందుతుందన్నారు. తెలుగులో అవధాన ప్రక్రియ మనకే సొంతం అని అటువంటి సాహిత్య ప్రక్రియలకు ఆధునితను మేళవించి భాషను రక్తి కట్టించాలన్నారు. అనంతరం తెలుగు పరిశోధక విద్యార్థి శ్రీ ఇళ్ళ మురళీధరరావు రచించిన పద్యకావ్యాలను ఆవిష్కరించారు .విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో తెలుగు ఆచార్యులు డా బూసి వెంకటస్వామి ,డా కె రత్నశేఖర్ ,డా పి లావణ్య ,డా ఏ వెంకటేశ్వర్లు (యోగి) ,పరిశోధక విద్యార్థులు ,స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

# అందరికీ జ్ఞానం అందాలనేదే గిడుగు భాషాదృక్పథం

**ప్రజాతపన ,హైదరాబాద్, ఆగస్టు 29:**




సామాన్యులకు కూడా అన్ని రంగాల్లో గల విజ్ఞానం భాష ద్వారా అందుకోవాలనేదే గిడుగు రామమూర్తి పంతులు గారి వ్యవహారిక భాషా ఉద్యమ దృక్పథం అని ఆచార్యదార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. తెలుగు భాషా వారోత్సవాలలో భాగంగా టంగుటూరి ప్రకాశం, గిడుగు రామమూర్తి జయంతి ఉత్సవాలలో భాగంగా సేవ తెలుగు భాష సాహితీ,సాంస్కృతిక సంస్థ, నెల్లూరు, తిరుపతి వారు సోమవారం నాడు అంతర్జాలం ద్వారా నిర్వహించిన సమావేశంలో 'గిడుగు వ్యావహారిక భాషా దృక్పథం' గురించి హెచ్ సియు, సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. సవరల భాష, సాహిత్యం, సంస్కృతులను గిడుగు పరిశోధన, రచనలు ఆయనలోని అభ్యుదయ దృక్పథానికి నిదర్శనంగా నిలుస్తాయని ఆచార్య దార్ల వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి రాసిన రచనలు, ఆయన ఉద్యోగం అన్నీ వ్యావహారిక భాషాభివృద్ధికి తోడ్పాటు అందించాయని వివరించారు. గిడుగు భాషావ్యాసాలు, వాటిలోని వివిధ అంశాలపై డా.బాణాల భుజంగరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేవ సంస్థ అధ్యక్షులు కంచర్ల సుబ్బానాయుడు, డా.కొణిదల శోభ, డా.బోర భారతీదేవి, సొతకు రత్నజానకి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బండ ధర తగ్గిస్తోన్న కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటోంది. దీంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు లాభాలు ఆర్జించాయి. ఇప్పుడు ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేస్తున్నారు. 2023 జులైలో రిటైల్ ఇన్‌ఫ్లేషన్ 7.44 శాతంగా నమోదైంది. 15 నెలల గరిష్ఠానికి చేరుకుంది. మరింత పెరిగితే ఇబ్బందులు తప్పవు. అందుకే గ్యాస్ సిలిండర్ ధర తగ్గిస్తే కొంత ఉపశమనం లభిస్తుందని మోదీ సర్కారు భావించింది.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ అతి త్వరలోనే గ్యాస్ సిలిండర్ల ధరను తగ్గించబోతోందని నేటి మధ్యాహ్నం వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనా (ఖఓజజ) పథకం లబ్ధిదారులకు ఈ ప్రయోజనం దక్కనుంది. ఇప్పటికే కేంద్రం ఎల్పీజీ సిలిండర్లపై రూ.200 రాయితీ ఇస్తోంది. ఇప్పుడు అదనంగా రూ.200 వరకు తగ్గించనుంది. దాంతో పీఎంయూవై లబ్ధిదారులు ఒక్కో సిలిండర్‌పై రూ.400 వరకు ఆదా చేసుకోవచ్చు. ఉజ్వలా పథకం లబ్ధిదారులకు ఏడాది పాటు రూ.200 వరకు సబ్సిడీ పొడగిస్తూ 2023 మార్చిలోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గ్రామీణ ప్రజలు, పేదలకు ఎల్పీజీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో కేంద్రం 2016లో ప్రధాన మంత్రి ఉజ్వలా యోజనను ఆరంభించింది. ఎలాంటి డిపాజిట్లు లేకుండా వీరికి ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇచ్చింది. అర్హులైన లబ్ధిదారులకు ఒక్కో సిలిండర్‌పై సబ్సిడీని బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తోంది.

ఆగస్టు నెలారంభంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సవరించాయి. 19 కిలోల ఎల్పీజీ బండపై రూ.99.75 తగ్గించింది. దాంతో దిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1680కి చేరుకుంది. అయితే 14.2 కిలోల గృహ అవసరాల సిలిండర్ ధరను మార్చి ఒకటి నుంచి తగ్గించలేదు. ప్రస్తుతం సబ్సిడీయేతర సిలిండర్ రూ.1100 నుంచి రూ.1120 వరకు ఉంటోంది. బహుశా సెప్టెంబర్ ఒకటి నుంచి డొమస్టిక్ సిలిండర్ల ధరలు తగ్గుతాయని అంచనా.

# ఆంధ్రప్రదేశ్ సచివాలయం వెలగపూడి లో ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు




సడ్లపల్లె చిదంబరెడ్డికి గిడుగు పురస్కారం




తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు ప్రధానం చేశారు. వేదిక మీద అనేక సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించారు






**ప్రజాతపన ,విజయవాడ, ఆగస్టు 29:**

ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం ఆధ్వర్యంలో వెలగపూడి లోని సచివాలయంలో మాతృభాష వారోత్సవాలు ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా తెలుగు భాషను చక్కగా అమలు చేసిన వెలగపూడి సచివాలయ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ జవహార్ రెడ్డి చేతుల మీదుగా తెలుగు భాషా పురస్కారాలు అందించడం జరిగింది. ఉద్యోగులు ఉత్సాహంతో పాటలు పద్యాలు పాడి కార్యక్రమాన్ని ఉత్సాహపరిచారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షులు పి విజయబాబు గారుఅధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు ఆచార్య గాజులపల్లి రామచంద్రారెడ్డి గారు డాక్టర్ తవ్వా వెంకటయ్య గారు డాక్టర్ డి మస్తానమ్మ గారు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అధిక కాలుష్యం నగరం ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్య స్థాయి కన్నా ఎక్కువ స్థాయిలో కాలుష్యం ఉన్నట్లు తెలిపారు. దేశంలో 67 శాతం మంది తీవ్ర కాలుష్య పరిస్థితుల్లోనే రోజులు గడుపుతున్నట్లు తెలిపారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రాంతంలో పార్టికులేట్ పొల్యూషన్ డబ్ల్యూహెచ్‌వో సూచించిన స్థాయి కన్నా ఏడు రెట్లు ఎక్కువగా ఉంది. ఒకవేళ కాలుష్య తీవ్రత ఇదే స్థాయిలో కొనసాగితే అప్పుడు జీవితకాలం 3.1 సంవత్సరాలు తగ్గనున్నదని రిపోర్టు తెలిపింది. ఢిల్లీ ప్రాంతంలో మిగితా దేశంతో పోలిస్తే సాంద్రత మూడు రెట్లు ఎక్కువగా ఉందని రిపోర్టులో తెలిపారు. వాహనాలు, నిర్మాణాలు, వ్యవసాయం వల్ల కూడా కాలుష్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. కాలుష్య వాయువులను పీల్చడం వల్ల బంగ్లాదేశ్, ఇండియా, పాకిస్థాన్, చైనా, నైజీరియా, ఇండోనేషియా దేశాల ప్రజలు ఆరేళ్ల వరకు తమ జీవితకాలాన్ని కోల్పోనున్నట్లు అంచనా వేస్తున్నారు.

# అరుణాచల్‌ప్రదేశ్, ఆక్సాయ్ చిన్ మావే

(మొదటిపేజీ తరువాయి)

టిబెట్‌గా పేర్కొంది. ఇక 1962 వరకు కశ్మీర్‌లో భాగంగా ఉన్న అక్సాయ్ చిన్‌ను డ్రాగన్ దేశం ఆక్రమించుకున్నది. అప్పటి నుంచి ఈ భూభాగంపై భారత్, చైనాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఇక తైవాన్ , దక్షిణ చైనా సముద్రాలను కూడా చైనాలో భాగమేనని నూతన మ్యాప్‌లో పేర్కొంది. దక్షిణ చైనా సముంద్రంలో అతిపెద్ద భాగంగా ఉన్న నైన్ డ్యాష్ లైన్‌ను కూడా తమ ప్రాంతంగా చూపించుకున్నది. అయితే దీనిపై వియత్నాం, ఫిలిప్పీన్స్, మలేషియా, బ్రూనై దేశాలు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. కాగా, బ్రిక్స్ సదస్సులో భాగంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య సరిహద్దు వివాదం సహా ద్వైపాక్షిక అంశాలపై సంప్రదింపులు జరిగాయని బీజింగ్ అధికారిక ప్రకటనలో వెల్లడించిన విషయం తెలిసిందే. భారత్-చైనా సంబంధాల మెరుగుపడితే ఇరు దేశాలతో పాటు ప్రజల ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరతాయని జిన్‌పింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మంత్రి రోజా భర్త సెల్వమణికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ.

(మొదటిపేజీ తరువాయి)

వల్ల తాను తీవ్ర ఇబ్బందులు పడ్డానంటూ మంత్రి రోజా భర్త సెల్వమణి ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. తెలుగుతోపాటు తమిళ సినిమాలకు పని చేశారు రోజా భర్త సెల్వమణి.. అయితే 2016లో ఓ టీవీ ఇంటర్వ్యూ సందర్భంగా ఒక ఫైనాన్షియర్ పై అభ్యంతర వ్యాఖ్యలు చేశాడు. ఒక ఫైనాన్షియల్ వల్ల తాను తీవ్రంగా నష్టపోయానని ఆ ఫైనాన్స్ పేరు ప్రస్తావిస్తూ ఒక టీవీ ఛానల్ కు 2016లో ఇంటర్వ్యూ ఇచ్చాడు సెల్వమణి. ఆ ఇంటర్వ్యూను చూసిన సదరు ఫైనాన్షియర్ సెల్వమణిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. చెన్నైలోని జార్జ్ టౌన్ కోర్టులో సెల్వమణిపై పరువు నష్టం దావా కేసు వేశాడు. ముకుల్ చంద్ బోత్ర అనే ఫైనాన్షియర్ పై సెల్వమణి వాక్యాలు చేశాడు.

2016 నుండి ఈ కేసు విచారణ కొనసాగుతూనే ఉంది. అయితే కొద్ది సంవత్సరాల క్రితమే ఫైనాన్షియల్ ముకుల్ చంద్ మరణించాడు.. తన తండ్రికి జరిగిన అన్యాయాన్ని సహించని ముకుల్ చంద్ కుమారుడు గగన్ బోత్రా కేస్ ను కొనసాగించారు. అయితే కేసు విచారణ సందర్భంగా కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఇదివరకే సమన్లు జారీ చేసింది. కోర్టు సమన్లు జారీ తర్వాత కూడా విచారణకు గైర్హాజరయ్యారు మంత్రి రోజా భర్త.. దీంతో ఆగ్రహించిన కోర్టు సెల్వమణిపై నాన్బెలబుల్ వారెంట్ జారీ చేసింది? తదుపరి విచారణను సెప్టెంబర్ 22 కు వాయిదా వేసింది. తెలుగుతోపాటు తమిళంలోనూ పలు చిత్రాలకు దర్శకత్వం వహించాడు సెల్వమణి.. ప్రస్తుతం ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్, ఫెఫ్సీ అధ్యక్షుడిగా ఉన్నారు.

# టైట్ షెడ్యూల్ లో జనసేనాని

(మొదటిపేజీ తరువాయి)

కేవలం రాజకీయాలపైనే దృష్టి పెడతారట పవన్ కళ్యాణ్. ఎన్నికల వరకూ మొత్తం 100 రోజుల పాటు 100 సభలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారట. వారాహి యాత్రలో కవర్ కాని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనవరి నుంచి పవన్ బహిరంగ సభలు నిర్వహించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసే పనిలో ఉన్నారని తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ మూడు విడతల వారాహి యాత్ర అనంతరం.. కేవలం కొన్ని ప్రాంతాలకే పవన్ యాత్ర పరిమితమవుతుందని.. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు ఉండవని రాజకీయంగా విమర్శలు వచ్చాయి. కానీ పవన్ కళ్యాణ్ తాజా షెడ్యూల్ ప్రకారం.. అన్ని జిల్లాల్లో పర్యటనలు ఉంటాయంటున్నారు పార్టీ నేతలు.. ముఖ్యంగా పార్టీకి పట్టున్న నియోజకవర్గాల్లో ముందుగా పర్యటన చేయడం.. అక్కడ ఖచ్చితంగా విజయం సాధించాలని ముందుకెళ్తున్నారు. ఇక జనవరి నుంచి మొత్తం 175 నియోజకవర్గాల్లో పర్యటనలు,100 బహిరంగ సభల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాలు కవర్ చేయాలనుకుంటున్నారు. అయితే పొత్తులపై స్పష్టత వచ్చినా.. రాకున్నా ఈలోగానే మెజార్టీ స్థానాలు కవర్ చేసేలా షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి పవన్ వారాహి యాత్ర కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉండేలా జనసేన పార్టీ అధినేత కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పవర్ స్టార్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గత కొన్నేళ్లుగా సినిమాలు, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు డిసెంబర్ దాకా ఆయనకు హెక్టిక్ షెడ్యూల్ ఉండబోతోందని తెలుస్తోందిజనసేనాని పవన్ వారాహి విజయయాత్ర ఇప్పటికే మూడు విడతలు ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖలో పవన్ కళ్యాణ్ పర్యటించారు. అయితే తర్వాతి విడత గురించి తాజాగా అప్డేట్ వచ్చింది.. ఇక పవన్ కళ్యాణ్ చేస్తున్న సినిమాల విషయానికి వస్తే 'ఓజీ' సినిమా మాత్రమే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. అటు మరో సినిమా 'హరిహర వీరమల్లు' నుంచి అప్డేట్ వచ్చి చాలా కాలం అయింది. ఇక ఉస్తాద్ భగత్ సింగ్ ది కూడా అదే పరిస్థితి. మరి ఇంతటి టైట్ ప్యాక్డ్ షెడ్యూల్ లో ఎన్నికలు వచ్చేలోగా ఈ సినిమాల షూటింగ్స్ ని పవన్ కళ్యాణ్ ఏ మేరకు పూర్తి చేస్తారనేది ఆసక్తిగా మారింది.

# దేశ నిర్మాణంలో భాగం అవుతా

అభివృద్ధి చెందిన తర్వాత ప్రజలు పిల్లలు వద్దని అనుకుంటారు. అప్పుడు యువ శక్తి తగ్గుతుంది. అందుకే, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జనాభా పెరగాలి అని కోరుకుంటున్నా. పిల్లల్ని కనాలి అని ప్రోత్సహిస్తున్నామన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ అనేది ఉండాలన్నారు.

ప్రతి కుటుంబాన్ని మానిటర్ చేసేలా సాంకేతికత వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేలా చూడొచ్చన్నారు. అదాని, అంబానీ, టాటా అంటూ కొందరికే ఆస్తులు సృష్టించడం కంటే ప్రతి కుటుంబం అస్తి సృష్టించే అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. ప్రతి భారతీయులు గ్లోబల్ ఆలోచనలు చేస్తారన్నారు. ఇక్కడ కూర్చుని గ్లోబల్ అవసరాలు తీర్చే ఉద్యోగం చేయవచ్చుని.. ఇండియన్ అనేవాడు భూమి మీద ఎక్కడైనా సర్వైవ్ కాగలడు. భారతీయులకు ఉన్న గొప్ప లక్షణం ఎక్కడైనా సర్వైవ్ అవ్వడమేనన్నారు. జపనీయులు గుంపుగా తప్ప విడిగా బయటకు రారు. భారతీయులు ఏ వాతావరణం అయినా తట్టుకుంటారన్నారు. ఇండియన్ కల్చర్ బెస్ట్ కల్చర్. భారతీయులను చూసి అమెరికా ప్రజలు అసూయ పడుతున్నారన్నారు.

రూ. 500, ఆపై కరెన్సీ నోట్లను రద్దు చేయాలని సూచించానని చంద్రబాబు గుర్తు చేశారు. అలా చేస్తే ఎన్నికల్లో నగదు పంపిణీ ఉండదు. మంచి ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయన్నారు. రాజకీయ అనుభవం ఉన్నవాళ్లెవరూ మోడీని విమర్శించడం లేదని చంద్రబాబు గుర్తు చేశారు. మోడీ వయసు గురించి మాట్లాడే దమ్ము వైసీపీ వాళ్లకు ఉందా?

# వ్యూహకర్తలపైనే పార్టీల గురి


## పీకే వర్సెస్ రాబిన్ సింగ్

**విజయవాడ, ఆగస్టు 29:**

ఎన్నిక ఏదైనా వ్యూహం ఉండాల్సిందే.. నిర్ణయం ఏదైనా తుది నివేదిక ఇవ్వాల్సిందే.. జననాడిని, నేతల చూపును ఎప్పటికప్పుడు పసిగట్టే ఆ షాడో టీమ్‌లు రాజకీయాల్లో ఇప్పుడు రాజకీయాల్లో కీలకంగా మారాయి. ఏపీలో కూడా ఆ టీమ్‌లు ఇచ్చిన నివేదికలే పార్టీల అధినేతలకు ఫైనల్ రిపోర్ట్.. అందుకే అందుకే ఆ టీమ్‌లకు అంతటి ప్రాధాన్యత నెలకొంది. అయితే, ఏపీలో ఎన్నిక ఏదైనా గెలుపు వైఎస్సార్సీపీదే.. కనీవినీ ఎరుగని స్థాయిలో సీట్లు సాధించి రికార్డ్ సృష్టించింది జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఇంతటి ఘన విజయం సాధించడం వెనుక ఎవరి స్ట్రాటజీ ఉందో అందరికీ తెలుసు.. అదే ప్రశాంత్ కిషోర్ టీమ్.. వైసీపీ నేతలకు కొన్నేళ్లుగా వెనకుండి విజయాలు అందిస్తోంది.. పీకే టీం వ్యూహాలతోనే వైఎస్సార్ కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ లభించిందని పేర్కొంటుంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎప్పటికప్పుడు వ్యహాలతో ముందుకు వెళ్తూ ప్రభుత్వానికి బలంగా మారింది పీకే టీం.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అనేది ప్రశాంత్ కిషోర్ ఆలోచనగానే చెప్తున్నారు. పూర్తి స్థాయిలో పార్టీ కేడర్ ప్రజల్లో ఉండటం,ప్రతి గడపనూ టచ్ చేయడం ద్వారా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేలా చేశారు. అంతేకాదు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై స్వయంగా ఎమ్మెల్యేలు,ఇంచార్జిలు వెళ్లి తెలుసుకోవడం ద్వారా ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అంతేకాదు ఎమ్మెల్యేలు, ఇన్చార్జీలతో నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఒక్కో టీంని ఏర్పాటు చేయడం, స్థానిక నేతలపై ఎప్పటికప్పుడు అధిష్టానానికి నివేదికలు ఇస్తున్నారు ప్రశాంత్ కిషోర్ టీం.. రెండు మూడు నెలలకోసారి పీకే టీం ఇచ్చే నివేదికలను సీఎం జగన్ స్వయంగా నేతల ముందు ఉంచుతున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందా? స్థానిక నేతలపై ఎలాంటి అభిప్రాయం ఉంది అనేది సీఎంకు అందిస్తున్నారు. అయితే వైసీపీకి ఇంత మంచి పేరు తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రశాంత్ కిషోర్ వచ్చే ఎన్నికలకు టీడీపీకి పని చేయనున్నారని ఈ మధ్య బాగా ప్రచారం జరిగింది. చంద్రబాబును కూడా ప్రశాంత్ కిషోర్ కలిసినట్లు టీడీపీ వర్గాలు చెప్పుకోచ్చాయి. అయితే, ఈ విషయంలో మళ్లీ చంద్రబాబు వెనక్కి తగ్గారని తెలిసింది.వైఎస్సార్ సీపీకి పీకే టీం వెనక ఉండి నడిపిస్తున్నట్లుగానే.. తెలుగుదేశం పార్టీ కూడా రెండేళ్ల క్రితం ఓ స్ట్రాటజీ టీమ్ ను ఏర్పాటు చేసుకుంది. గతంలో ప్రశాంత్ కిశోర్ టీంలో పనిచేసిన సీనియర్ స్ట్రాటజిస్ట్ రాబిన్ సింగ్ తెలుగుదేశం పార్టీకి ప్రస్తుతం వర్క్ చేస్తున్నారు. రాబిన్ సింగ్ టీం ఇచ్చే రిపోర్ట్స్ ఆధారంగా టీడీపీ ఎప్పటికప్పుడు తన కార్యక్రమాలు రూపొందించుకుంటుంది. అయితే, ప్రశాంత్ కిషోర్ టీం ను తన వైపుకు తిప్పుకొనేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. పీకే తో ఒకసారి సమావేశం కూడా జరిగినట్లు చెబుతున్నారు. త్వరలోనే వైసీపీకి పీకే గుడ్ బై చెబుతారని కూడా విసృతంగా ప్రచారం జరిగింది. అయితే, తాజాగా ప్రశాంత్ కిషోర్‌ను తాము తీసుకోవడం లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే రాబిన్ శర్మ టీం పని చేస్తుండటం, కొత్తగా పీకే టీంను తీసుకోవడం ద్వారా చాలా సమీకరణాలు మారిపోయే ఛాన్స్ ఉందని సీనియర్లు చెప్పడంతో చంద్రబాబు ఈ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు తెలిసింది. చంద్రబాబు వద్దని చెప్పడంతో ప్రశాంత్ కిషోర్ వచ్చే ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్‌కు పని చేస్తారని సమాచారం. ప్రస్తుతం వైసీపీ సెంట్రల్ ఆఫీస్‌లో ఐప్యాక్ టీం తన కార్యకలాపాలు కొనసాగిస్తోంది. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం తరహాలో మరో కొత్త కార్యక్రమానికి ప్లాన్ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం..గత ఎన్నికల్లో వైసీపీకి ప్రశాంత్ కిషోర్ స్ట్రాటజీ బాగా కలిసొచ్చింది. అయితే అప్పట్లో టీడీపీకి ఎలాంటి స్ట్రాటజీ టీమ్ లేదు. తెలుగుదేశం పార్టీకి ఎప్పటి నుంచో పనిచేస్తున్న బ్యాక్ ఎండ్ టీమ్ ఇచ్చిన నివేదికలు ఆధారంగానే చంద్రబాబు నిర్ణయాలు తీసుకునేవారు. అయితే, పీకే టీం రిపోర్ట్స్‌తో వైసీపీకి తిరుగులేని విజయాలు అందాయి. దీంతో అదే టీమ్‌లో పనిచేసిన రాబిన్ సింగ్ ను టీడీపీ తన స్ట్రాటజీ టీమ్ గా పెట్టుకుంది. రెండు టీమ్‌లు కూడా ఎప్పటికప్పుడు సొంత పార్టీ చేయాల్సిన కార్యక్రమాలతో పాటు క్షేత్ర స్థాయి నివేదికలను ఆయా పార్టీల అధినేతలకు అందిస్తున్నారు. అంతేకాదు పీకే, రాబిన్ సింగ్ లు ఇచ్చే సలహాలను సోషల్ మీడియా ద్వారా బాగా ప్రచారంలోకి తీసుకెళ్తున్నాయి రెండు పార్టీలు. దీంతో ఈసారి రెండు పార్టీలకు ఆయా టీంలు చాలా బలంగా మారాయని చెప్పవచ్చు. సామాజిక వర్గాల వారీగా ఓటర్లను ఆకట్టుకోవడంలో స్ట్రాటజీ టీమ్‌ల సలహాల పైనే రెండు పార్టీలు ఆధారపడ్డాయి. మరి పీకే టీమ్‌తో వైసీపీ, రాబిన్ సింగ్ టీమ్‌తో టీడీపీకి ఈసారి ఎలాంటి ఫలితాలు వస్తాయనేది ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# హిందూపురంపై పెద్దిరెడ్డి గురి

**అనంతపురం, ఆగస్టు 29:**



వై నాట్ 175 మూడ్‌లో ఉన్న వైసీపీ.. టీడీపీ కీలక నియోజకవర్గాలను ఒక్కొక్కటిగా తన టార్గెట్ రేంజ్‌లోకి తీసుకొస్తోంది. కంచుకోటలైనా? ఇంకోటైనా? బద్దలు కొట్టి తీరాల్సిందేనంటోంది. ఇప్పటికే చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం లక్ష్యంగా ఓ రేంజ్‌లో పొలిటికల్ వార్ చేస్తున్న అధికార పార్టీ? తాజాగా హిందూపురంను ఫిక్స్ చేసే పని మొదలుపెట్టిందట. ఎప్పట్నుంచో టీడీపీని గెలిపిస్తున్న హిందూపురం ఓటర్లు గత రెండు విడతలుగా సినీ హీరో బాలకృష్ణను అసెంబ్లీకి పంపుతున్నారు. హ్యాట్రిక్ కోసం ప్లాన్ చేసుకుంటున్న బాలయ్యకు చెక్ పెట్టేపని ఆల్రెడీ మొదలైపోయిందట. చూడు?. ఒకవైపే చూడు?. అన్న ఆయన డైలాగ్‌నే రివర్స్ చేసి, చూస్తాం?. రెండో వైపు చూపిస్తాం? అని అంటోందట వైసీపీ అధినాయకత్వం. మిగతా నియోజకవర్గాల సంగతి ఎలా ఉన్నా? కుప్పం, హిందూపురంలో గెలిచి బావ బావమరుదులను ఇంటికి పంపాలనుకుంటోందట.కుప్పం విషయంలో ఇప్పటికే దూకుడుగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాజాగా హిందూపురం మీద ఫోకస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్ ఛార్జి మంత్రిగా ఉన్నారు పెద్దిరెడ్డి. జిల్లాల విభజన తరువాత రీజనల్ కో-ఆర్డినేటర్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే హిందూపురంపై ఫోకస్ పెట్టి?వైసీపీలోని గ్రూప్ వార్‌కు చెక్ పెట్టారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను తప్పించి.. కొత్త అభ్యర్థిని రంగంలోకి దించారు. కురుబ కులానికి చెందిన దీపికకు పార్టీ పగ్గాలు ఇచ్చారు. ఆమె భర్త రెడ్డి సామాజిక వర్గం కావడం.. ఇక్కడ పార్టీకి కలిసొచ్చే ఇంకో అంశం. ఈ నిర్ణయం ద్వారా విబేధాలతో ఉన్న నేతలందరికీ షాక్ ఇవ్వడమే కాకుండా రెండు బలమైన సామాజిక వర్గాల మద్దతు వచ్చే విధంగా వ్యూహ రచన చేశారు. దీపికకు కొందరు నేతలు సహకరించకున్నా? బ్యాక్‌గ్రౌండ్‌లో వర్కౌట్ చేస్తున్నారట పెద్దిరెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఈసారి హిందూపురంలో బాలకృష్ణకు చెక్ పెట్టాలన్నది ఆయన పట్టుదలగా చెబుతున్నారు.టీడీపీ బలగా ఉందని చెప్పుకునే చలివెందుల గ్రామంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికలో వైసీపీ గెలిచిందని, తాము లోకల్‌లో బలంగా ఉన్నామని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలని అడుగుతున్నారట పెద్దిరెడ్డి. హిందూపురంలో గెలవాలని సీఎం జగన్ కూడా గట్టిగా ఉన్నారని, అవసరమైతే స్వయంగా రెండు మూడు సార్లు ప్రచారం నిర్వహిస్తారని కార్యకర్తలకు భరోసా ఇచ్చారని అంటున్నారు. వర్గాలు వీడి దీపిక విజయం కోసం అంతా పని చేయాల్సిందేనని, అటు కుప్పం, ఇటు హిందూపురం రెండు చోట్ల వియ్యంకులకు గట్టి స్ట్రోక్ ఇవ్వాలని అధినాయకత్వం నుంచి ఆదేశాలు వచ్చాయట. మరీ ముఖ్యంగా హిందూపురం నేతలంతా విభేదాలు పక్కనపెట్టి పనిచేస్తే? బాలయ్యని ఓడించడం పెద్ద కష్టం కాదని అంటోందట నాయకత్వం. మరి ఎన్నికల టైంకి పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి.

# క్లాస్ రూమ్ లో ఫోన్ల వాడకంపై నిషేధం...

**గుంటూరు, ఆగస్టు 29:**





ఆంధ్రప్రదేశ్?లో ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ ఫోన్లను నిషేధిస్తూ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి బోధన సమయంలో తరగతి గదుల్లో సెల్?ఫోన్?లు వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. మొబైల్ ఫోన్లను వ్యక్తిగత పనులకు వాడుతూ విద్యార్థులకు నష్టం కలిగిస్తున్నారంటోంది ప్రభుత్వం. బోధనా ప్రమాణాల పెంపునకు ఇది ఆటంకంగా మారిందని చెబుతోంది. తరగతి గదిలో బోధనా ప్రమాణాలు పెంచడంలో భాగంగానే సెల్ ఫోన్ల వాడకంపై నిషేదం విధించినట్లు రాష్ట్ర సర్కార్ తెలిపింది. మొబైల్ ఫోన్లు ఎందుకు నిషేధిస్తున్నాం.. ఉపాధ్యాయులు,విద్యార్థులు ఎలాంటి నిబంధనలు ఫాలో కావాలి.. నిబంధనలు పాటించని వారిపై ఎలాంటి చర్యలుంటాయి అనే అంశాలతో కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని జిల్లాల డీఈవోలు,ఆర్జేడీలకు ఈ ఆదేశాలు కఠినంగా అమలయ్యేలా చూడాలని సూచించింది.తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వృత్తిపరమైన అవసరాలకు కాకుండా వ్యక్తిగత అవసరాల కోసం మొబైల్ ఫోన్లు ఉపయోగిస్తూ బోధనా సమయాన్ని వృధా చేస్తున్నారంటోంది ప్రభుత్వం. అంతేకాదు యునెస్కో 2003 లో ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదేశాల్లో పేర్కొంది.ఆగస్టు మూడో తేదీన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నిర్వహించిన సమావేశంలో నిపుణుల అభిప్రాయాలు తీసుకున్నారు. పాఠశాలల్లో టెక్నాలజీ వినియోగం-గుడ్ గవర్నెన్స్?కు సంబంధించి విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయాల ఆధారంగా ఈ ఆదేశాలిచ్చినట్లు పేర్కొంది.నిపుణుల అభిప్రాయాల ఆధారంగా సెల్ ఫోన్?ల వల్ల విద్యార్థుల అకడమిక్ పెర్మార్మెన్స్?కు కు నష్టం కలుగుతుందనే ఉద్దేశంతోనే తరగతి గదుల్లో బ్యాన్ చేస్తున్నట్లు పేర్కొంది సర్కార్. మొబైల్ ఫోన్ వాడకంపై టీచర్లతో పాటు విద్యార్థులకు కూడా కొన్ని కండిషన్స్ పెట్టింది. తరగతి గదుల్లోకి ఉపాధ్యాయులు సెల్ ఫోన్ తీసుకెళ్లకూడదు. బోధనా సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ వాడకూడదని పేర్కొంది. తరగతిలో విద్యార్థుల హాజరు తీసుకున్న తర్వాత మొబైల్ ఫోన్ లను సైలెండ్ మోడ్ లో పెట్టి హెడ్మాస్టర్?కు అప్పగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఒకవేళ కరికులమ్?కు సంబంధించి తీసుకెళ్లాల్సి ఉంటే ముందుగానే హెడ్మాస్టర్ అనుమతి తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.మరోవైపు విద్యార్థులు కూడా మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా కొన్ని కండిషన్ లు పెట్టింది. తరగతి గదుల్లో విద్యార్థులు మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకూడదు. హెడ్మాస్టర్ గదిలో లేదా క్లర్క్ వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అత్యవసరం అయితే హెడ్మాస్టర్ అనుమతి తీసుకుని ఉపయోగించాల్సి ఉంటుంది. తరగతి గదుల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసి ఎల్?ఈడీ ప్యానళ్లు, స్మార్ట్ టీవీలను కేవలం బోధన కొరకు మాత్రమే ఉపయోగించాలని పేర్కొంది. ఉపాధ్యాయులు ఉదయం తొమ్మిదిన్నరకు ముందు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే సెల్ ఫోన్ వినియోగించాల్సి ఉంటుంది. ఒకవేళ అటెండెన్స్ తీసుకోవడం ఆలస్యం అయితే సంబంధిత హెడ్మాస్టర్ అనుమతితో సెల్ ఫోన్ ఉపయోగించాల్సి ఉంటుంది. మొదటి సారి నిబంధనలు ఉల్లంఘిస్తే మరోసారి ఇలా చేయమని సంబంధిత ఉపాధ్యాయుడు.. హెడ్మాస్టర్‌కు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. రెండోసారి మండల విద్యాశాఖాధికారితో మాట్లాడిన తర్వాత మాత్రమే సెల్ ఫోన్ తీసుకోవాల్సి ఉంటుంది. మూడోసారి గనుక రిపీట్ అయితే ఉపాధ్యాయుడి సెల్ ఫోన్?ను డీఈవో?కు సరెండర్ చేయాల్సి ఉంటుంది. డీఈవోతో చర్చించిన తర్వాత మాత్రమే సర్వీస్ రిజిస్టర్?లో నమోదు చేసి సెల్ ఫోన్ తీసుకోవాల్సి ఉంటుంది.పాఠశాల విద్యాశాఖ అధికారులు అకస్మిక తనిఖీల సమయంలో సెల్ ఫోన్ నిషేధం నిబంధనలు ఖచ్చితంగా అమలవుతున్నాయో లేదో చూడాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. బయటి వ్యక్తులు గాని విద్యార్థులు గానీ నిబంధనల విషయం లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్‌ను బాధ్యులు చేసేలా ఆదేశాలిచ్చింది. పాఠశాలల్లో తనిఖీల సమయంలో నిబంధనలు ఉల్లంఘించనట్లు తేలితే హెడ్మాస్టర్లదే బాధ్యత అని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు. కొన్ని రోజుల పాటు ఈ నిబంధనలకు సంబంధించి పూర్తి స్థాయిలో అన్ని పాఠశాలలకు అవగాహన కల్పించిన తర్వాత కఠినంగా అమలుచేయాలని అధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# పాఠశాల విద్యలో మొదటి భాషగా సంస్కృతం

**విజయవాడ, ఆగస్టు 29:**

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యలో మొదటి భాషగా సంస్కృతం సబ్జెక్టును తీసుకు రావాలని ఆ రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను ఏపీ సర్కారుకు పంపించింది. త్వరలోనే ఉత్తర్వులు కూడా రాబోతున్నట్లు తెలుస్తోంది. మొదటి భాషగా సంస్కృతం భాషను ఎంచుకున్న విద్యార్థులు రెండో భాషగా హిందీకి బదులు తెలుగు సబ్జెక్టు చదవాల్సి ఉంటుంది. అలాగే మూడో భాషగా ఆంగ్లం(ఇంగ్లీషు) ఉంటుంది. తెలుగు సబ్జెక్టును మొదటి భాషగా తీసుకున్న వారు రెండో భాషగా హిందీ చదవాల్సి ఉండగా.. ఎప్పటిలాగే మూడో భాషగా ఇంగ్లీషు ఉంటుంది. విద్యార్థులు ఆరో తరగతిలో మొదటి భాషను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సంస్కృతం పుస్తకాలు ఆరో తరగతి నుంచి ఉన్నాయి. పదో తరగతి పరీక్షల సంస్కరణల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాంపొజిట్ తెలుగును తొలగించింది. ఇందులో తెలుగు 70 మార్కులు, సంస్కృతం 30మార్కులకు ఉండేది. తెలుగునే వంద మార్కులకు చేసినందున సంస్కృతం సబ్జెక్టుకు అవకాశం కల్పించాలనే డిమాండ్ వచ్చింది. దీంతో పాఠశాల విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కృతం ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అంతేకాదండోయ్ ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా కన్నడ, తమిళం, ఒడియా, హిందీ, ఉర్దూ మొదటి భాషగా చదువుతున్న విద్యార్థులు 10వేల వరకు ఉన్నారు. ఇప్పుడు సంస్కృతం తీసుకువస్తే ఈ విద్యార్థుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. సంస్కృతంలో ఎక్కువ మార్కులు సాధించే వీలు ఉన్నందున ఎక్కువ శాతం మంది విద్యార్థులు సంస్కృతాన్నే మొదటి భాషగా తీసుకునే అవకాశం కనిపిస్తోంది

# ఎలుగుబంటి దాడిలో రైతు కి తీవ్రగాయాలు



**అనంతపురం**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లి గ్రామ శివారులో రైతు యల్లప్ప పై ఎలుగుబంటి దాడి చేసింది. పొలం పనులకు వెళుతున్న రైతు యల్లప్పపై ఎలుగు బంటి దాడిలో తీవ్రంగా గాయపరుస్తుండగా గ్రామస్తులు కేకలు వేయగా అడవిలోకి పరుగులు తీసింది. రైతు యల్లప్ప పొట్ట భాగంలో తీవ్రగాయాలు కావడంతో గ్రామస్థులు, కుటుంబసభ్యులు 108 లో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎలుగు బంట్లు సంచరిస్తున్నాయని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకొలేదని గ్రామస్తులు అంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఎలుగు బంటి ధాడుల నుంచి కాపాడలని వారు కోరుతున్నారు.

# సిటీలో మరిన్ని ఎలక్ట్రిక్ సర్వీసులు

**హైదరాబాద్, ఆగస్టు 29:**

హైదరాబాద్‌లో పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఎంఎంటిఎస్, మెట్రో రైలు సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాలకు ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించిందిహైదరాబాద్‌లో పలు ప్రాంతాలకు ఎలక్ట్రికల్ బస్సుల్ని అందుబాటులోకి తీసుకురావాలని టిఎస్ ఆర్టీసి నిర్ణయించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీఎస్ ఆర్టీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎంఎంటీఎస్, మెట్రో రైలు సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్, మియాపూర్ ఆర్టీసీ డిపోల పరిధిలో ఈ బస్సులను నడిపాలని గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ జోన్ అధికారులు నిర్ణయించారు. సికింద్రాబాద్ ? పంజాగుట్ట ? జూబ్లీహిల్స్ చెక్ పోస్టు ? ఫిల్మ్ నగర్ ? ఉస్మానియా కాలనీల మీదుగా మణికొండ వరకు ఈ సర్వీసులు నడపాలని నిర్ణయించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి జూబ్లీ బస్ స్టేషన్, సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, ఎల్‌బీ నగర్, ఇబ్రహీంపట్నం వరకు నడపాలని నిర్ణయించారు .మియాపూర్ డిపో పరిధిలో బాచుపల్లి ? జేఎన్‌టీయూ ? కేపీహెచ్‌బీ ? హైటెక్ సిటీ ? బయోడైవర్సిటీ ? గచ్చిబౌలి ? వేవ్ రాక్ ? ప్రగతి నగర్ ? జేఎన్‌టీయూ, వీబీఐటీ వరకు ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులన్నింటికి జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను అమర్చుస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి 30 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉండే విధంగా బస్సులను నడపనున్నారు.

# ఆలయాల ప్రాంగణంలో రాజకీయ రాతలు

**జగిత్యాల**

జిల్లా లోని బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ ముత్యాల పోచమ్మ - నల్ల పోచమ్మ ఆలయాల ప్రాంగణంలో గోడలన్నీ మంగళవారం రాజకీయ రాతలతో నిండిపోయాయి. వాటిని చూసిన భక్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వెంటనే అధికారులు, ఆలయ కమిటీ వారు స్పందించి బాధ్యులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆలయాల గోడలను, ఆలయ పరిసరాలను కూడా వదిలిపెట్టరా..? ఇంత నీచమైన రాజకీయం ఏమిటని భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు స్వయంగా వారే రంగులతో గోడ వ్రాతలు రాస్తున్నట్లు ఫోటోలకు ఫోజులు ఇవ్వడం, సోషల్ మీడియా స్టేటస్ లలో ఆ ఫోటోలను పోస్టులు చేయడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

## అవనిగడ్డ లో టెన్షన్

**అవనిగడ్డ**
మంగళవారం ఉదయం అవనిగడ్డ లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీగా అవనిగడ్డకు చేరుకున్నారు. సోమవారం ఘంటసాల మండలం శ్రీకాకుళం వద్ద ఇసుక క్వారీలలో టీడీపీ సత్యాగ్రహాన్ని ఘంటసాల ఎస్ ఐ శ్రీనివాస్ అడ్డుకున్న విషయం తెలిసిందే. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఘంటసాల ఎస్ ఐ శ్రీనివాస్ ప్రవర్తనకు నిరసన తెలిసారు. మంగళవారం ఘంటసాల పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. బుద్ధప్రసాద్ దీక్ష నేపథ్యంలో అవనిగడ్డ, ఘంటసాల లలో పోలీసులు భారీగా మోహరించారు.

## కే ఏ పాల్ నిరాహార దీక్ష

**విశాఖపట్నం**
విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో కేఏ పాల్ ఆమరణ నిరాహార దీక్ష మొదలు పెట్టారు. కేంద్రం ప్రకటన చేసే వరకు తన దీక్ష కొనసా గుతుందని లేదా నా ప్రాణా లు పోయేవరకు ఈ దీక్ష కొనసాగుతుం దని కేఏ పాల్ తేల్చి చెప్పారు.ఈ క్రమం లో తనకు ఏదైనా జరిగితే దానికి నరేంద్ర మోదీ, అమి త్ షానే బాధ్యత అని అన్నారు.నరేంద్ర మోదీతో పాటుగా, అదానీ తొత్తులు కొంతమంది విశా ఖ స్టీల్పై తాను వేసిన పిటిషన్ ను విచారణకు రాకుండా అడ్డు కుంటున్నా రని అన్నారు.దాదాపు 8 లక్షల కోట్ల విలువ చేసే స్టీల్ ప్లాంట్ ను,4 వేల కోట్లకి అమ్మాలని ప్రయత్నం చేస్తున్నా రని కేఏ పాల్ ఆరోపించారు.కేంద్రం స్టీల్ ప్లాం టు అమ్మనని ప్రకటన చేయా లని అన్నారు.

## కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే బ్రహ్మ నాయుడు

### జీవి అంజనేయులుపై పిర్యాదు

**పల్నాడు**
పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం లో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేసిన భూ ఆక్రమణల పై జిల్లా కలెక్టర్ కి ఆధారాలతో సహా నివేదికను ఇచ్చారు. జివి ఆంజనేయులు పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈ విషయం పై కమిటీ ని ఏర్పాటు చేసి, ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని అన్నారని తెలియజేశారు.

## పెందుర్తిలో ఘోర రోడ్డు ప్రమాదం

**విశాఖపట్నం**
పెందుర్తిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ముందు వెళ్తున్న వ్యాన్ ని గుద్దడంతో కారు డ్రైవర్ సూర్య భగవాన్ (28) మృతి చెందాడు. సబ్బవరం నుండి పెందుర్తి వైపు వెళ్తున్న కారు ఐ సర్ వ్యాన్ ను గుద్దడంతో కారులో ఉన్న ఒకరు మృతి చెందగా మిగతా నలుగురులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన నలుగురిని హాస్పిటల్ కు తరలింపు ప్రమాదానికి అతివేగమే కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు.

## మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం

**హైదరాబాద్**
మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం దందాను పోలీసులు గుర్తించారు. రెండు సెంటర్స్ లో బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి నిర్వాహకులపై కేసులు నమోదు చేసారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని హెవెన్ ఫ్యామిలీ స్పా, ది వెల్వెట్ స్పా మసాజ్ సెంటర్ స్పా ముసుగులో వ్యభిచారం చేస్తున్నట్లు నిర్ధారించారు. తొమ్మిది మంది సెక్స్ వర్క ర్లను పునరావాస కేంద్రానికి తరలించారు. నిర్వాహకులు కె.నీలిమ, ఎన్. కార్తీక్, జ్యోతి బజాజ్, సయ్యద్ యూసుఫ్ బాషాలపై కేసు నమోదు చేసారు.

## ముదిరాజుల ధర్నా

**కుత్బుల్లాపూర్**
దుండిగల్ మునిసిపల్ పరిధి గండిమైసమ్మ చౌరస్తా లో ముదిరాజ్ సంఘం ఆద్వర్యంలో దర్నా నిర్వహించారు. బి.ఆర్. ఎస్ పార్టీ అసెంబ్లీ సీట్ల టికెట్ల కేటాయింపులో ముదిరాజులకు జరిగిన అన్యాయన్ని నిరసిస్తూ ముదిరాజ్ సంఘం ఆద్వర్యంలో దర్నా జరిగింది. ముదిరాజ్ ల ఐక్యత వర్థిలాలి,, కె.సి.ఆర్ ఖభర్ధార్ అంటూ నినాదాలు చేసారు. గండి మైసమ్మ చౌరస్తా లో మానవాహారం చేసి భైఠాయించారు. దాంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. , పోలీసుల రంగప్రవేశం చేసి నచ్చచెప్పడంతో దర్నా విరమించారు

## విమనాశ్రయానికి బాంబు బెదిరింపు

**రంగారెడ్డి**




శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తయింది. వెంటనే ) ఎయిర్ పోర్టులో తనిఖీలు చేపట్టారు. మరోవైపు ఫోన్ కాల్ ను ఆరా తీసారు. అంతలోనే ఎయిర్ పోర్ట్ అధికారులకు ఫోన్ చేసి సదరు ఫోన్ కాలర్ క్షమాపణ చెప్పాడు. పొరపాటున తమ పిల్లలు ఫోన్ తీసుకొని చేశారని ఆ వ్యక్తి భద్రతా సిబ్బందికి క్షమాపణలు కోరినట్లు సమాచారం. దాంతో ఎయిర్పోర్ట్ భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# ఆర్టికల్ 370 రద్దుపై వాదన..లెక్చరర్ సస్పెండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 29:**

కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వాదించిన ప్రభుత్వ కాలేజీ లెక్చరర్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ విషయం సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి రావడంతో తీవ్రంగా స్పందించింది. ఆయన్ను విధుల నుంచి ఎందుకు తొలగించారని? కోర్టులో వాదనలు వినిపిస్తే సస్పెండ్ చేస్తారా? అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆయన ఎందుకు పక్కనబెట్టారో తెలుసుకోవాలంటూ అటార్నీ జనరల్‌ను ఆదేశించింది.ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టులో రోజువారీ విచారణ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ విద్యా విభాగానికి చెందిన లెక్చరర్ హూర్ అహ్మద్ భట్ కూడా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే ఆగస్టు 24 నాటి విచారణకు ఆయన కూడా హాజరయ్యారు. లా డిగ్రీ పూర్తిచేసి పట్టా కలిగిన భట్.. తన పిటిషన్‌పై స్వయంగా ఆయనే వాదనలు వినిపించారు. అయితే, ఆ మర్నాడే భట్ అనూహ్యంగా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు ఆగస్టు 25న జమ్మూ కశ్మీర్ విద్యా విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జమ్మూ కశ్మీర్ సివిల్ సర్వీస్ నిబంధనలు, జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ ఉద్యోగుల నియామావళిని, రాష్ట్ర ప్రభుత్వ సెలవు నియమావళిని ఉల్లంఘించిన కారణంగా సస్పెండ్ చేసినట్టు తెలిపింది. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. "లెక్చరర్ అహ్మద్ భట్ రెండు రోజులు సెలవు తీసుకుని విచారణకు వచ్చి వాదనలు వినిపించారు. తిరిగి వెళ్లగానే ఆయన సస్పెండ్ అయ్యారు" అని ధర్మాసనానికి సిబల్ తెలిపారు. ఈ విషయాన్ని సీజేఐ ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ఆయనను ఎందుకు సస్పెండ్ చేశారో తెలుసుకోవాలని ఏజీ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాలను ఆదేశించింది.మిస్టర్ అటార్నీ జనరల్.. ఈ కోర్టు ముందు వాదనలు వినిపించిన వ్యక్తిని సస్పెండ్ చేశారా? ఇలా జరగడమేంటి... దీనిపై వెంటనే జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌తో మాట్లాడండి. పూర్తి వివరాలు సమర్పించండి' అని ఏజీ, ఎస్‌జీలకు కోర్టు స్పష్టం చేసింది. దీనికి ఎస్‌జీ తుషార్ మెహతా స్పందిస్తూ.. 'లెక్చరర్ సస్పెన్షన్ వెనుక పలు కారణాలు ఉన్నాయని తెలిసింది. ఆయన తరచూ విభిన్న కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఆ వివరాలన్నీ కోర్టుకు సమర్పిస్తాం' అని తెలిపారు.'మరేదైనా కారణం ఉంటే సస్పెండ్ చేయడం ఎందుకు?.. ఖచ్చితంగా ఇదిసరైనది కాదు' అని ఈ సందర్భంగా ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ ఎస్కే కౌల్ అన్నారు. మరో న్యాయమూర్తి బీఆర్ గవాయ్.. ఇది ప్రభుత్వ ప్రతీకార చర్యగా అనిపిస్తోందన్నారు. 'న్యాయస్థానానికి వచ్చారని అలా జరిగితే అది ప్రతీకార చర్యే.. ఇలాంటి చర్యలకు పాల్పడితే స్వేచ్ఛ ఏమవుతుంది' అని వ్యాఖ్యానించారు.

# కృష్ణా ప్రాజెక్టులకు నీటి కొరత

**హైదరాబాద్, ఆగస్టు 29:**

కృష్ణా ప్రాజెక్టులకు వరద రావడం లేదు. నీటి ప్రవాహం లేక జలాశయాలు వెలవెలబోతున్నాయి. ప్రాజెక్టుల్లో రోజురోజుకూ నీటి మట్టాలు పడిపోతున్నాయి. గత 15 రోజులుగా కృష్ణా నదిలోకి ప్రవాహాలు లేకపోవడం వల్ల నీటి సమస్యలు తప్పేలా లేవు. సాధారణంగా ప్రవాహం భారీగా కాకపోయినా.. కనీసం ప్రాజెక్టుల కింద అవసరాల మేరకు భర్తీ చేసే స్థాయిలో నీరు ఉండేది. అయితే ఈ ఏడాది మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. కనీస స్థాయిల్లోనూ నీటి ప్రవాహం రావడం లేదు. ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఈ నెల 10వ తేదీ తర్వాత 20 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినట్లు అధికారులు చెబుతున్నాయి. అయితే ఆయా ప్రాజెక్టుల్లో నీటి స్థాయిలు తక్కువగా ఉండటంతో ఆ 20 వేల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు వచ్చే పరిస్థితి లేదు. అయితే జూరాల ప్రాజెక్టుకు మాత్రం స్థానికంగా కురిసన వర్షాల వల్ల స్వల్పంగా ప్రవాహం వచ్చింది. శ్రీశైలం ప్రాజెక్టుకు కనీస ఇన్ ఫ్లో కూడా లేదు. ఈ నెల 12వ తేదీ తర్వాత ఇన్ ఫ్లో పూర్తిగా పడిపోయింది. కర్ణాటకతోపాటు రాష్ట్రంలోనూ వర్షాలు లేక ఈ పరిస్థితి తలెత్తింది. జూరాల, తుంగభద్ర నుంచి కూడా ప్రవాహం రావడం లేదు. 12వ తేదీన శ్రీశైలం ప్రాజెక్టులో 122 టీఎంసీల నిల్వ ఉండగా.. ఆదివారం 94 టీఎంసీలకు చేరింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులకుగానూ ప్రస్తుతం 855.90 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. 121.57 టీఎంసీల మేర ఖాళీ ఉంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో తాగు, సాగు నీటి అవసరాలకు స్వల్పంగానే నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ను ఉత్పత్తి చేస్తోంది. ఈ జలాశయం కింద 15 రోజుల్లో 28 టీఎంసీల వినియోగం నమోదు అయినట్లు గణాంకాలు చెబుతున్ననాగార్జున సాగర్ ప్రాజెక్టు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. శ్రీశైలం జలాశయం నుంచి జల విద్యుత్ ఉత్పత్తిలో వస్తున్న ప్రవాహం తప్ప నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ప్రవాహం రావడం లేదు. జల విద్యుత్ ఉత్పత్తి తో విడుదల నీటి వల్ల నాగార్జున సాగర్ లో దాదాపు 9 టీఎంసీల నిల్వ పెరిగింది. స్థానికంగా వర్షాలు లేకపోవడంతో ప్రవాహం లేదు. కాల్వలకు కూడా స్వల్పంగానే నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా తెలంగాణ పగటిపూట విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రాత్రి సమయంలో రివర్స్ పంపింగ్ తో నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తోంది.గోదావరి ప్రాజెక్టుల్లో మాత్రం నీరు పుష్కలంగా ఉంది. మొన్నటి వరకు ఎగువ ప్రాంతాల్లో దట్టంగా కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. నది ఉప్పొంగి ప్రవహించడంతో గోదావరి జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్, మధ్య మానేరు, దిగువ మానేరు, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి, ధవళేశ్వరం బ్యారేజీల్లో నీరు ఆశాజనకంగా ఉన్నాయి.

# హైదరాబాద్ వైపు అంతర్జాతీయ రియల్ సంస్థలు దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 29:**

2047 నాటికి భారతదేశం రియల్ ఎస్టేట్ మార్కెట్ 5.8 ట్రిలియన్ డాలర్లకు విస్తరిస్తుందని నైట్ ఫ్రాంక్ నివేదిక తెలిపింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని పేర్కొంది. రియల్ ఎస్టేట్ రంగంలో వృద్ధి సాధిస్తున్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల కారణంగా భారతదేశం రియల్ ఎస్టేట్ రంగం 2022లోని 477 బిలియన్ల డాలర్ల మార్కెట్ నుంచి 2047 నాటికి 5.8 ట్రిలియన్ల డాలర్లకు విస్తరిస్తుంది. నైట్ ఫ్రాంక్, నేషనల్ రియల్ ఎస్టేట్ అభివృద్ధి మండలి సంయుక్త నివేదిక ఈ విషయాన్ని పేర్కొంది. ఈ వృద్ధి దేశం ఆర్థిక ఉత్పత్తికి 15 శాతానికి పైగా దోహదం చేస్తుందని నైట్ ఫ్రాంక్, నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ నివేదిక తెలిపింది. ప్రధానంగా వేర్‌హౌసింగ్, రెసిడెన్షియల్ విభాగాలు 12 రెట్లు ఎక్కువ వృద్ధిని నమోదు చేస్తాయని పేర్కొంది. ఇండియా రియల్ ఎస్టేట్ : విజన్ 2047 పేరుతో రియల్టర్ల సంఘం నరెడ్కో, రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ సంయుక్త నివేదికను శనివారం విడుదల చేసింది.భారతదేశం రియల్ ఎస్టేట్ రంగం 2047 నాటికి వి5.8 ట్రిలియన్ కు విస్తరిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనా ప్రకారం రియల్ ఎస్టేట్ అవుట్‌పుట్ విలువ 2047లో మొత్తం ఆర్థిక ఉత్పత్తికి 15.5 శాతం దోహదపడుతుంది. ఇది ప్రస్తుతమున్న 7.3 శాతం వాటాగా ఉంది. 2047 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం వి33 ట్రిలియన్ నుంచి వి40 ట్రిలియన్ల మధ్య ఉంటుందని నరెడ్కో-నైట్ ఫ్రాంక్ నివేదిక అంచనా వేసింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలోకి.. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల నుంచి పెట్టుబడులను కొనసాగుతాయని నైట్ ఫ్రాంక్ ఇండియా పేర్కొంది. హైదరాబాద్‌లో ఐటీ, బీఎఫ్ఎస్ఐ రంగాల నుంచి పెట్టుబడులు కొనసాగుతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ వర్టికల్స్ కూడా పెట్టుబడులు పెరుగుతున్నాయని నైట్ ఫ్రాంక్ సీనియర్ బ్రాంచ్ డైరెక్టర్ శాంసన్ ఆర్థర్ తెలిపారు. డేటా సెంటర్, ఇ-కామర్స్ కోసం వేర్‌హౌసింగ్, ఇతర పరిశ్రమలకు హైదరా బాద్ అనుకూలంగా మారిందన్నారు. హెచ్ఎన్ఐలు.. పెద్ద పరిమాణాల్లో, ఎత్తైన భవనాలు, మరిన్ని సౌకర్యాలు, ఖరీదైన ఇంటీరియర్‌లకు ప్రాధాన్యత ఇవ్వడంతో హైదరాబాద్‌లో హౌసింగ్ ఉన్నత స్థాయికి చేరుకుంటోందని ఆయన చెప్పారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ పరిసర ప్రాంతాలలో భూముల ధరల పెరుగుదల కారణంగా.. బుద్వేల్, గండిపేట, కోకాపేట్ ప్రాంతాల్లో మరిన్ని ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని ఆర్థర్ తెలిపారు. 2047 నాటికి వి36 ట్రిలియన్‌లకు ఆర్థిక విస్తరణకు మద్దతుగా 69 శాతం మంది శ్రామిక జనాభా ఉపాధి పొందుతారని నైట్ ఫ్రాంక్ అంచనా వేసింది.

# మూడవ రోజు కొనసాగిన ఎస్సై అభ్యర్థుల ఈవెంట్స్ .

**కర్నూలు,ఆగస్ట్ 29**

పోలీసు నియామక పక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ 2 వ బెటాలియన్ లో మూడవ రోజు దేహదారుడ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.ఈ రోజు 800 మంది అభ్యర్దులను పిలిచారు.కాని 541మంది అభ్యర్దులు హజరయ్యారు. ఎస్సై మెయిన్స్




ఫైనల్ పరీక్ష కు ఈ రోజు 383 మంది ఎంపికయ్యారు. కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ దేహాదారుడ్య సామర్థ్య పరీక్షలను పర్యవేక్షించారు.దేహాదారుడ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, లేటెస్ట్ కుల ధృవీకరణ సర్టిఫికెట్ , క్రిమిలేయర్ సర్టిఫికెట్ , ఆధార్, అడ్మిట్ కార్డు, స్టడీ, మార్కిలిస్టులు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ సర్టిఫికెట్లు ( గెజిటెడ్ సంతకంతో ) తప్పనిసరిగా తీసుకుని రావలెనని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు.

## నిరుద్యోగుల నిరసన

**హైదరాబాద్**
మెగా డిఎస్సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు తలపెట్టిన పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బషీర్ బాగ్ చౌరస్తా లో నుండి రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరింది. నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు , నిరుద్యోగుల మధ్య తోపులాట జరిగింది. తరువాత నిరుద్యోగులపై లాఠీఛార్జ్ జరిగింది. పోలీసులను దాటుకుని అసెంబ్లీ వైపు నిరసనకారులు పరుగెత్తారు. అసెంబ్లీ పరిసరాల్లో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది.

## ఆపరేషన్ చేసారు

## కడుపులో కాటన్ ప్యాడ్ వుంచేసారు

**మంచిర్యాల**
మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. పురిటి నొప్పుల తో ఆసుపత్రికి వచ్చిన కీర్తిలయ కు డాక్టర్లు డెలివరీ చేసారు. తరువాత ఆమె కడుపులో కాటన్ ప్యాడ్ మర్చిపోయారు. ఐదు రోజుల నుండి మహిళకు తీవ్ర అస్వస్థత కు గురయింది. సోమవారం రాత్రి చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి కాటన్ ప్యాడ్ ను వైద్యులు బయటకు తీసారు.

## సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

**జగిత్యాల**
జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జగిత్యాల ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కోర్టులలో 9 సెప్టెంబర్ 2023 రోజున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందనిజిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ చైర్మన్ జగిత్యాల, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తెలిపారు..ఈ జాతీయ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు (దావాలు), కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహన చట్టంకు సంబంధించిన కేసులు, బ్యాంకు కేసులు, చిట్ ఫండ్ కేసులు ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించబడునని కావున కచ్చిదారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 9 సెప్టెంబర్ 2023 రోజున నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలతో మీ యొక్క కేసులు పరిష్కరించుకోగలరని జిల్లా న్యాయమూర్తి నీలిమ కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలను పాటించండి

### శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన



**జగిత్యాల**
ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరు తప్పనిసరిగా పాటించాలని అప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డిఆర్ఎస్పీ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. కృష్ణ అన్నారు. మంగళవారం ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆర్.ఎస్.ఐ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్లపై నడిచేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటిస్తూ రోడ్డుకు ఎడమవైపు నడవాలని సూచించారు. మైనర్లు వాహనాలను నడపరాదని నడిపితే చట్టరీత్య చర్యలకు గురవుతారన్నారు.మైనర్లు వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమైన మరణాలకు దారితీసినా వారి తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారన్నారు.విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకొని ఇతరులకు మార్గదర్శకులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలోట్రాఫిక్ ఎస్సై రామచంద్రం,ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ ముసిపట్ల రాజేందర్ ,అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## గుడ్ టచ్ బాడ్ టచ్ పై అవగాహన

**శ్రీకాళహస్తి**

సీనియర్ సివిల్ జడ్జ్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి లోని ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాలనందు గుడ్ టచ్ బాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ప్రముఖ న్యాయవాదులు ప్రజ్ఞశ్రీ, మరియు గరికపాటి రమేష్.న్యాయవాదులు ప్రజ్ఞశ్రీ, గరికిపాటి రమేష్ మాట్లాడుతూ..నేడు విద్యార్థినీలు సమాజంలో తిరిగేటప్పుడు కొంతమంది ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగానే విద్యార్థినులను తాకుతూ ఇబ్బందులు పెడుతున్నారని దానిపై విద్యార్థినీలు పాఠశాల నుంచి వారి వారి ఇళ్లకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థినిలు సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన పెంచుకోవాలని, .తల్లిదండ్రులు పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలని. విద్యార్థినిలు కొత్త వ్యక్తులతో పరిచయం ఏర్పరుచుకునేటప్పుడు తగు జాగ్రత్తగా ఉండాలని అన్నారు,

# కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు

**హైదరాబాద్, ఆగస్టు 29:**

ఈసారి ఎలాగైనా సరే తెలంగాణలో గెలుపు కేసీఆర్ దేనని అర్థమవుతోంది. కేసీఆర్ ఉన్న ఫళంగా 115 అసెంబ్లీ సీట్లను ప్రకటించడంతో చాలా మంది టికెట్ రాని వారు కాంగ్రెస్ తరుపున పోటీచేసేందుకు ఆల్ రెడీ దరఖాస్తులు చేసేశారు. వారందరూ కూడా కేసీఆర్ కోవర్టులు అని ప్రచారం సాగుతోంది. అంతేకాదు.. కేసీఆర్ ముందే వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పార్టీలోకి కొందరు నేతలను పంపారని.. బలమైన నేతలకు 30 కోట్ల చొప్పున ఇచ్చి వారిని నియోజకవర్గాల్లో గెలిపించే బాధ్యతను తీసుకున్నట్టు ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ నేతలు ఓడిపోయే చోట ఈ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించేసి వారిని తిరిగి గెలిచాక బీఆర్ఎస్ లోకి లాగే ఎత్తుగడ వేసినట్టుగా రాజకీయవర్గాల్లో ఓ ప్రచారం మొదలైంది. కేసీఆర్ ను కాంగ్రెస్ నమ్మకూడదని బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ రాకపోతే మొదట చీల్చేది కాంగ్రెస్ నే అని.. కాంగ్రెస్ లోకి కేసీఆర్ కోవర్టులను పంపించారని ఆరోపించారు. ఇప్పుడు ఈ ఆరోపణలను నిజం చేస్తూ చెన్నూర్ ఎమ్మెల్యే.. మళ్లీ టికెట్ పొందిన బాల్క సుమన్ సంచలన ఆరోపణలు చేశారు. 'నియోజకవర్గంలో తిరిగే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను నాయకులను ఎవ్వరూ ఏం అనకండి.. వాళ్లు మనవాళ్లే.. మేమే కొంత మందిని ఎంపిక చేసి కాంగ్రెస్ లోకి పంపినం.. వాళ్లు బీఆర్ఎస్ కోసమే పనిచేస్తారు. గెలిచినా బీఆర్ఎస్ లోకే వస్తారు. అది మా గేమ్ ప్లాన్.. ఎవరికీ చెప్పకండి' అంటూ సంచలన నిజాన్ని బయటపెట్టారు.ఇటీవల కేసీఆర్ అసెంబ్లీ టికెట్ల ప్రకటన సందర్భంగా ఆయన వెనుకనే బాల్క సుమన్ ఉన్నారు. కేసీఆర్ ఆ లిస్ట్ తోపాటు పలు కీలక పత్రాలు అందజేశారు. సో ఈ వ్యూహంలో బాల్కసుమన్ కూడా ఉన్నాడని.. ఆయన చెప్పేవన్నీ కేసీఆర్ చేస్తున్నాడని.. కాంగ్రెస్ లోకి కేసీఆర్ కోవర్టులను పంపాడని అర్థమవుతోంది. ఈ నిజం ఇప్పుడు తెలంగాణ రాజకీయవర్గాల్లో పెను సంచలనమైంది. కాంగ్రెస్ లో పెద్ద కుదుపునకు కారణం అవుతోంది. కేసీఆర్ కాంగ్రెస్ లోకి పంపిన ఆ కోవర్టులు ఎవరన్న చర్చ మొదలైంది.

# తృప్తి త్యాగి...ఘటనపై సీరియస్

**లక్నో, ఆగస్టు 29 :**

ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్‌నగర్ లోని తృప్తి త్యాగి అనే మహిళా టీచర్ పాఠశాలలోని ముస్లిం విద్యార్థిని తోటి విద్యార్థులతో కొట్టించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ముజఫర్‌నగర్ ఖుబ్బాపూర్ గ్రామంలోని నేహా పబ్లిక్ స్కూల్ లో ఈ ఘటన జరిగింది. రెండో తరగతి చదివే ముస్లిం విద్యార్థిని నేహా పబ్లిక్ స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ తృప్తి త్యాగి తోటి విద్యార్థులతో కొట్టించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సర్కారు స్పందించి స్కూల్ ను మూసేయించింది. అయితే ఈ ఘటనపై పలు వార్తా ఛానళ్లు తృప్తి త్యాగిని వివరణ కోరగా.. ఆమె తాను చేసిన పనిని సమర్థించుకున్నారు. అది చాలా చిన్న విషయమని, దానిని పెద్దది చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని మొదట్లో సమర్థించుకున్న తృప్తి త్యాగి.. దేశవ్యాప్తంగా ఈ ఘటనపై ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతుండటంతో కాస్త వెనక్కి తగ్గారు. తాను తప్పు చేశానని ఒప్పుకున్నారు. ముస్లిం విద్యార్థిని తోటి విద్యార్థులతో కొట్టించడం తప్పేనని తాను తప్పు చేశానని క్షమాపణ కోరారు. అలా కొట్టించడం తప్పేనన్న తృప్తి త్యాగి.. అందులో ఎలాంటి హిందూ-ముస్లిం మత విద్వేషం లేదని చెప్పుకొచ్చారు. తానను వికలాంగురాలినని.. లేవలేకపోవడం వల్లే తోటి విద్యార్థులతో కొట్టించినట్లు తెలిపారు. ఈ వీడియో వైరల్ అవడం వల్ల ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో స్కూల్‌ని బంద్ చేయాలని యోగి సర్కార్ ఆదేశించింది. ఇప్పటికే విద్యాశాఖ కూడా ఈ ఘటనపై విచారణ మొదలు పెట్టింది. స్కూల్ యాజమాన్యానికి నోటీసులు పంపింది. స్కూల్ బంద్ చేయడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా స్థానిక పాఠశాలల్లో వాళ్లందరికీ తాత్కాలిక అడ్మిషన్‌లు ఇచ్చారు. మళ్లీ ఆదేశాలిచ్చేంత వరకూ స్కూల్‌ని ఓపెన్ చేయకూడదని అధికారులు తేల్చి చెప్పారు. నిందితురాలు తృప్తి త్యాగి మాత్రం తన చర్యల్ని సమర్థించుకుంటున్నారు. ఇది చాలా చిన్న విషయం అని కొట్టి పారేస్తున్నారు. కేవలం హోం వర్క్ చేయలేదన్న కారణంగానే విద్యార్థులతో కొట్టించానని, ఇందులో మతపరమైన వివక్ష ఏమీ లేదని తేల్చి చెబుతున్నారు. తల్లిదండ్రులే తమ కొడుకుని కాస్త మందలించాలని కోరినట్టు కొత్త వాదన తెరపైకి తీసుకొచ్చారు తృప్తి త్యాగి. ఆ ముస్లిం విద్యార్థి తల్లిదండ్రులకూ కౌన్సిలింగ్ ఇచ్చారు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు. ఈ ఘటన జరిగిన రోజు స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు. కానీ సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవడం వల్ల అధికారుల దృష్టికి వెళ్లింది. వాళ్లు విచారణ మొదలు పెట్టాక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఖుబర్‌పూర్ గ్రామంలోని ఓ పాఠశాలలో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే దీనిపై విచారణ మొదలు పెట్టారు. ఈ వీడియోలో టీచర్ ముస్లింలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసింది. క్లాస్‌లో ఉన్న విద్యార్థులంతా ఒకరి తరవాత ఒకరు ఆ ముస్లిం విద్యార్థిని కొట్టాలని ఆదేశించింది. టీచర్ చెప్పినట్టుగానే విద్యార్థులంతా ఒకరి తరవాత ఒకరు ఆ ముస్లిం విద్యార్థిని చెంపపై కొట్టారు. ఇలా కొడుతూ ఉండగా చైర్‌లో కూర్చున్న టీచర్ "ఇంకా గట్టిగా కొట్టండి" అంటూ ఆర్డర్ వేసింది. ఓ స్టూడెంట్ చెంపమీద కొట్టినా ఆగకుండా...నడుముపైన కొట్టండి అంటూ కుర్చీలో కూర్చుని ఆర్డర్‌లు వేసింది ఆ మహిళా టీచర్.

# వినాయకచవితికి భాగ్యనగరం ముస్తాబు

**హైదరాబాద్, ఆగస్టు 29:**

హైదరాబాద్ లో వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి తలసాని ఆదేశించారు. వచ్చే నెల 19న గణేష్ చతుర్థి నిర్వహించాలని భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు నిర్ణయించారు. హైదరాబాద్ లో గణేష్ చతుర్థి ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సెప్టెంబర్ 19న వినాయక చవితి పండుగ నిర్వహించాలని సూచించింది. సెప్టెంబర్ 28న నిమజ్జనం ఉంటుందని స్పష్టం చేసింది. ఈ ఏడాది గణేష్ చతుర్థి ఏ రోజున జరుపుకోవాలనే సందేహం నెలకొంది. సెప్టెంబర్ 18వ తేదీన మధ్యాహ్నం చవితి మొదలై 19వ తేదీ మధ్యాహ్నం వరకు కొనసాగుతోంది. సూర్యోదయం తర్వాత వచ్చిన తిథినే పండుగ రోజుగా గుర్తిస్తామని భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. కాబట్టి 19వ తేదీన సంప్రదాయబద్దంగా వినాయక చవితి నిర్వహించుకోవాలన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వినాయక చవితి ఏర్పాట్లు, మండపాల నిర్వహణపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో సమావేశం అయ్యారు. ప్రతీ ఏటా గణేశ్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ తో పాటు చుట్టుపక్కల 32,500 వరకు వినాయక మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 19వ తేదీన వినాయక చవితి నవరాత్రులు ప్రారంభం అవుతాయని, 28న నిమజ్జనం జరిగేంత వరకు బందోబస్తు ఉంటుందన్నారు. బందోబస్తుకు తెలంగాణ పోలీసులతో పాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల పోలీసుల సాయం తీసుకుంటామని మంత్రి తలసాని వెల్లడించారు.గత ఏడాది లాగే ఈసారి కూడా గణేష్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వినాయక వ్రత కథ పుస్తకంతో పూజా సామాగ్రిని భక్తులకు ఇస్తామన్నారు. గణేష్ మండపాలకు పోలీసు పర్మిషన్ తప్పనిసరి కాదన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే చాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు పెట్టొద్దని సూచించారు. సుప్రీంకోర్టు ఫ్లెక్సీలను నిషేధించిందని గుర్తుచేశారు. గణేష్ ఉత్సవాల్లో ఈసారి కూడా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పెట్టవద్దన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పండుగ సజావుగా జరిగేందుకు కృషి చేయాలని కోరారు. గత తొమ్మిదేళ్లలో అన్ని మతాల పండుగలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందన్నారు. గణేష్ నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులను ఏర్పాటు చేస్తామన్నారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఒకేరోజు వస్తున్నాయన్న మంత్రి తలసాని, ఆరోజు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.అయితే వినాయక చవితి పండగను సెప్టెంబర్ 18న నిర్వహించుకోవాలని తెలంగాణ విద్వత్సభ సూచిస్తోంది. సెప్టెంబర్ 18 నుంచే నవరాత్రులను ప్రారంభించాలని విద్వత్సభ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం, అన్ని పీఠాలకు శాస్త్రబద్ధంగా నిర్ణయించిన పండగల జాబితాను విద్వత్సభ అందించింది. వినాయక చవితి పండగను సెప్టెంబర్ 18న ? లేదా సెప్టెంబర్ 19న నిర్వహించాలా? అనే అంశంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో 100 మంది సిద్ధాంతుల సమక్షంలో జులై 22, 23న షష్ఠమ వార్షిక విద్వత్సమ్మేళనంలో చర్చించి వినాయక చవితి పండగ తేదీపై ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే వినాయక చవితి నిర్వహణ తేదీపై ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

## క్రికెట్ పైలాన్లు ప్రారంభించిన మాజీ క్రికెటర్ రోజర్ బిన్నీ

**విశాఖపట్నం**

ఏసీఏ చేస్తున్న అభివృద్ధి పనులను చూ స్తుంటే చాలా ఆనందంగా ఉందని బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ అన్నా రు. విశాఖ జిల్లా పీఎం పాలెంలోని ఏ.సీ.ఏ - వీ.డీ.సీ.ఏ స్టేడియంలో ఏ.సి.ఏ పైలాన్లను బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ ప్రారంభించారు. ఆయ నతో పాటు మాజీ క్రికెటర్ మదన్ లాల్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఏ.సీ.ఏ సెక్రటరీ గోపినాధ్ రెడ్డి పాల్గొన్నారు.ఏసీఏ చేస్తున్న అభి వృద్ధి పనులను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని బీసీ సీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ అన్నారు. విశాఖ జిల్లా పీఎం పాలెంలోని ఏ.సీ.ఏ ? వీ.డీ.సీ.ఏ స్టేడియంలో ఏ.సి.ఏ పైలాన్లను బీసీసీ ఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ ప్రారంభించా రు. ఆయనతో పాటు మాజీ క్రికెటర్ మద న్ లాల్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఏ.సీ.ఏ సెక్రటరీ గోపినాధ్ రెడ్డి పాల్గొన్నారు.పైలాన్లను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అండ ర్-19కు ప్రతిభావం తులైన క్రీడాకారులను ఏసీఏ అం దించిందని చెప్పారు. విశాఖ లో మంచి గ్రౌండ్స్ ఉన్నా యని వెల్లడించారు. అలాగే రానున్న పది సంవత్స రాలలో ఏపీలో క్రికెట్ మరింత అభివృద్ధి చెందుతుం దని తెలిపారు. ఇది ఇలా వుంటే తన నియోజకవ ర్గానికి అతిథు లు రావడం తనకు చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ అన్నారు.70 సంవ త్సరాలు దిగ్విజ యంగా పూర్తి చేసుకున్న ఏ.సీ.ఏ కార్యవర్గ సభ్యులుకు అభినందనలు తెలియజేస్తున్నా నన్నారు.అనంతరం బుడి ముత్యాల నాయుడు మాట్ల డు తూ? నేటికీ ఏసీఏ 70 సంవత్సరాలు పూర్తి చేసుకు న్న సందర్భంగా ఇటువం టి కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నందుకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. 1983 వరల్డ్ కప్లో ఆడిన క్రీడాకారులు ఈ సందర్భంగా విశా ఖకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏ.సీ.ఏ ఏర్పడి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సభ్యు లను మదన్ లాల్ అభినందించారు.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున మరి కొంత మంది క్రీడాకారుల ను అందించాలని ఆయన కోరారు. గడిచిన 70 ఏండ్ల లో ఏ.సీ.ఏ ఎన్నో విజయాలు సాధించిందని ఏ.సి.ఏ సెక్రటరీ గోపినాధ్ రెడ్డి అన్నారు. బీసీసీఐ పెద్దలు విశాఖకు రావడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు.

## గత ఏడాది ఐదు లక్షల ఉద్యోగాలిచ్చాం

**విశాఖపట్నం**

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఐదు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పిం చినట్టు కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరులు, ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ కుభా తెలిపారు. రోజ్‌గార్ మేళాను విశాఖ నగరంలోని సాలిగ్రామపురంలోని గల సాగరమాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజ రైన ఆయన మాట్లాడుతూ విశాఖ పట్నంతో సహా దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో 51,106 మందికి సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇస్తూ లెటర్లు అందించినట్టు చెప్పారు. వచ్చే ఏడాది మే నెలకు పది లక్షల ఉద్యోగాలు అందించాలని లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగ యువత ప్రతి భకు, నైపుణ్యానికి తగ్గ ఉద్యోగావకా శాలు కచ్చితంగా లభిస్తాయన్నారు. అనంతరం అభ్యర్థులకు కేంద్ర మంతి నియామక పత్రాలు అందజేశారు.

## టీటీడీలో అన్య మతస్థులకు చోటు కల్పించించినందుకు నిరసన

**గుడివాడ**

టిటిడి బోర్డులో అన్య మతస్థులు,లిక్కర్ మాఫియాను పెట్టవద్దంటు కృష్ణా జిల్లా గుడివాడ బిజెపి అధ్వర్యంలో సంతకాల సేకరణను నిర్వహించారు.పెద్ద సంఖ్యలో ప్రజానీకం సంతకాలు చేస్తూ బిజెపి చేస్తున్న కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీలో దొంగలు పడ్డారంటు ప్రజలతో కలిసి బిజెపి నేతలు నినాదాలు చేశారు.పవిత్ర హైందవ దేవాలయాల్లో అన్య మతస్థులకు ప్రభుత్వం చోటు కల్పించడం దారుణమని బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శలం కాయల లీలా కుమారి, బిజెపి ప్రవాస్ యోజన జిల్లా ఇన్చార్జి సూరే లక్ష్మీనారాయణ గాంధీ, పట్టణ అధ్యక్షుడు యర్రపోతు అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, వి హెచ్ పీ నాయకులు కూర్రాళ్ళ శ్యామ్, పలువురు హైందవ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ఏపీని దోచేస్తున్న వైసీపీ ఇసుక మాఫియా..

**ఏలూరు**

నూజివీడునూజివీడు నియోజకవర్గంలో ఇసుక అక్రమ మైనింగ్ పై ఈరోజు నూజివీడు పట్టణంలోని మార్కెట్ యార్డులో ఇసుక ర్యాంపు వద్ద నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీ నేతలతో కలిసి నిరసన ప్రదర్శన చేయడంతో పాటు సెల్ఫీ చాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో ఇసుక విక్రయాలు, ప్రభుత్వ పథకాల పేరిట వాగులు, వంకల నుంచి ఇసుక తవ్వేస్తున్నారన్నారు. రీచ్‌లలో తవ్వకాలు మొదలుకుని స్టాక్ పాయింట్లకు తరలింపు, విక్రయాలు, తూకం వంటివాటిలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విభాగాల పర్యవేక్షణ లోపం వైసీపీ నేతల భాగస్వాములు కావడంతో అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు.ఇసుక అక్రమ వ్యాపారం మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లుగా సాగిపోతోందని ఎద్దేవా చేశారు.

# సమ్మె ఉద్యోగుల జన్మ హక్కు

**షోకాజ్ నోటిసులకు భయపడకండి**

**సెకండ్ ఏఎన్ఎం లకు అండగా కాంగ్రెస్ పార్టీ**

**డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**జగిత్యాల**

సమ్మె ఉద్యోగుల జన్మ హక్కు అని, సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎం లను విధులకు రావాలని అధికారులు భయపెట్టడం సమంజసం కాదని, వారికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు.జగిత్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటియూసి అనుబంధ తెలంగాణ ఏఎన్ఎం ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ నాయకత్వంలో జరుగుతున్న సమ్మె మంగళవారం 14 వ రోజుకు చేరుకోగా ఏఎన్ఎంల దీక్షా శిబిరానికి డీసీసీ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి ,గొల్లపల్లి సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి లు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్, విజయలక్ష్మి లు మాట్లాడుతూ గ్రామాల్లో అంటురోగాలు, ఇతర వ్యాధులు ప్రబలితే డాక్టర్లు కాదని ప్రజలతో మమేకమై ఏఎన్ఎం లు వైద్య సేవలు అందిస్తుంటారని గుర్తు చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, కుటుంబాలను వదిలి సేవలందిస్తే ఇతర డిపార్ట్మెంట్ లో పనిచేసిన వారిని రెగ్యులరైజ్ చేసి వీరిని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.అధికార బిఆర్ఎస్ పార్టీ ఇతర పార్టీ నాయకులను చేర్చుకోవడం, మద్యం, డబ్బులు పంచి ఏవిధంగా అధికారంలోకి రావాలనే తాపత్రయం తప్పా నిత్యం ప్రజల్లో ఉంటున్న ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. గత జులై నెలలో విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని లక్ష్మణ్ కుమార్, విజయలక్ష్మి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత14 రోజులుగా మమ్మల్ని రెగ్యులర్ చేయాలనే ఒక్క డిమాండుతో మహిళ సోదరీమణులు రోడ్డెక్కి నిరసనలు చేస్తుంటే జిల్లాకు చెందిన మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే లు పట్టించుకోవడం లేదంటే వారికి ఉద్యోగుల పట్ల ఎంత నిర్లక్ష్యమో దీన్ని బట్టి తెలుస్తోందని విమర్శించారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థే ఉండదని, ధర్నాలు ఉండవన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు ఏమయ్యాయని వారు ప్రశ్నించారు. సమస్య పరిష్కరమైతే ఒకే, లేకుంటే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ,మేము మీ సమస్యను పరిష్కరిస్తామని, షోకాజ్ నోటీసులకు, అధికారుల బెదిరింపులకు ఎవరు బయపడకందని జీవన్ రెడ్డి తోపాటు కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని పునరుద్ఘటినీచారు. అందరూ ఐక్యంగా ఉంటే ప్రభుత్వం దిగివస్తుందన్నారు. మధురిమ మాట్లాడుతూమేము రోడ్డెక్కే పరిస్థితికి ముఖ్యమంత్రి కేసీఆర్ కారణమన్నారు. ఆరోగ్య శాఖలో కీలకంగా పనిచేస్తున్న మమ్మల్ని రెగ్యులరైజ్ చేసి రాష్ట్రంలోని సుమారు 6 వేల మందికి న్యాయం చేయాలని మధురిమ సీఎం కేసీఆర్ కు విజ్ఞప్తి చేశారు.మాకు న్యాయం జరిగేవరకు శాంతియుత పోరాటం చేస్తూనే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను ఉధృతం చేస్తామని మధురిమ హెచ్చరించారు.కార్యక్రమంలో నిరజ, పద్మ, ఎలిజబెత్, ఊర్మిల, శిరీష, మేరీ, శారద, శిరీష, జయప్రద, ప్రశాంతి, రాజమణి, జమున, స్వరూప, చిలుకమ్మ, సుజాత,గణిత, సరోజ, పుష్ప, సౌజన్య, రమాదేవి, జ్యోతి, రజిత, విజయలక్ష్మి, రాధ, శైలజ, సునీత, అహల్య, లక్ష్మీకాంత, సుగుణ, మహేశ్వరి, షాహిన్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో కాంగ్రెస్ కు లీడర్లు కావలెను

**హైదరాబాద్, ఆగస్టు 29:**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో స్తబ్దత నెలకొంది. ఎన్నికల టైం దగ్గర పడుతున్నా అభ్యర్థుల విషయంలో ఇంకా స్పష్టత రాలేదని అసహనంగా ఉన్నాయి పార్టీ శ్రేణులు. అధికార పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. అదే సమయంలో అసలు కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల కొరత ఉందని విమర్శలు గుప్పిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. నిన్న, మొన్నటి దాకా తీగల కృష్ణారెడ్డి, మహేందర్ రెడ్డి లాంటి సీనియర్స్ కారు పార్టీకి బైబై చెప్పి కాంగ్రెస్ లోకి వస్తారని గంపెడాశలు పెట్టుకున్నారు కాంగ్రెస్ నేతలు. కొందరైతే? బీఆర్ఎస్ నేతలతో రహస్య సమావేశాలు జరిపి సీట్ల కేటాయింపుతో పాటు ఇతర అంశాలపై పెద్ద ఎత్తునే చర్చలు నిర్వహించారు. అయితే అధికార పార్టీ?సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వడంతో పాటు ఆశావాహులందరిని ప్రగతి భవన్‌కు పిలిచి వారికి కావాల్సిన హమీలు ఇచ్చి దారికి తెచ్చుకోవడంతో.. మొదట్లో కాస్త కనిపించినా? క్రమంగా అసంతృప్తులు చల్లబడ్డాయి. దీంతో కాంగ్రెస్ నేతలు కంగుతింటున్నారట. ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు చాలా మంది కారు దిగి చెయ్యి పట్టుకుంటారని అనుకున్నా? ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఆ వాతావరణమే కనిపించడం లేదంటున్నారు. బీఆర్ఎస్ వలసలపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు అలాంటి వాతావరణం కనిపించకపోవడంతో ఇక బీజేపీలోని జిల్లాకు చెందిన బలమైన నేతలకు గాలం వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అటు బీఆర్ఎస్ అసంతృప్తులపై బీజేపీ సైతం ఆశలు పెట్టుకున్నా? ఉపయోగం లేకుండా పోయిందట.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉమ్మడి రంగారెడ్డిలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు కరువయ్యారన్నది పార్టీ వర్గాల మాట. ఉదాహరణకు మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి బరిలో ఉన్నారు. మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి అసంతృప్తితో బయటికి వస్తే .. మహేశ్వరం టిక్కెట్ ఇచ్చి సబిత మీద పోటీ పెడదామనుకున్నారట కాంగ్రెస్ నాయకులు. కానీ.. ఆ ఆశలు నెరవేరలేదు. ప్రస్తుతం అక్కడ బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, డిసిసి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, దేపా భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి లాంటి చాలా మంది నేతలు టిక్కెట్ ఆశిస్తున్నా? వారిలో ఎవరికీ సబిత స్థాయి లేదని పార్టీలోనే చర్చ నడుస్తోంది. గెలుపు సంగతి పక్కనపెడితే?వీరిలో ఎవరికీ కనీస పోటీ ఇచ్చే సామర్థ్యం లేదంటున్నారు. దీంతో ప్రస్తుతం మహేశ్వరం కాంగ్రెస్ దిక్కు మొక్కు లేకుండా ఉందట. ఇక ఎన్నికలకు సమయం పెద్దగా లేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన పెరుగుతోంది. ఇద్దరు ముగ్గురు పోటీలో ఉంటే? ఎవరో ఒకరికి టిక్కెట్ ఇస్తారు?మనం బరిలో ఉంటామన్న ధీమాతో పనిచేయవచ్చు. కానీ? అసలు అభ్యర్థి ఎవరో తెలీదు, పని చేయాలన్న ఉత్సాహం ఎలా వస్తుందని అడుగుతున్నారట కార్యకర్తలు.

# బీఆర్ఎస్ పార్టీలో అసమ్మతి

**అదిలాబాద్, ఆగస్టు 29:**

మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీలో అసమ్మతి మొదలైంది. మలి దశ ఉద్యమకారుడు, మంచిర్యాల బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన ఆయన మంచిర్యాలపై దొరల పెత్తనం మొదలైందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఉద్యమకారులకు టికెట్లు ఇస్తేనే మంచిర్యాలలో బీఆర్ఎస్ పార్టీ కొనసాగుతుందని, లేని పక్షంలో పార్టీని మంచిర్యాలలో పూర్తిగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మంచిర్యాలలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. మాతా శిశు ఆసుపత్రిని గోదావరి పరివాహక ప్రాంతంలో ఊరి బయట కట్టడం ఏంటని ప్రశ్నించారు. దానికి పరిష్కారం చేయలేని వారు పరిపాలన ఎలా కొనసాగిస్తారన్నారు. వారం రోజుల్లో హైకమాండ్ ను కలిసి మంచిర్యాల అభ్యర్థిని మార్చాలని కోరుతామని తెలిపారు. అభ్యర్థిని అప్పటికీ మార్చని పక్షంలో తామే బీసీ సామాజిక వర్గానికి చెందిన దమ్మున్న వారిని మంచిర్యాలలో ఎమ్మెల్యే గా నిర్ణయించి అ ఎమ్మెల్యేనీ గెలిపించుకుంటామని సవాల్ చేశారు. గడ్డం అరవింద రెడ్డి మాట్లాడుతూ.. "నాకు ఒకటే బాధ ఉంది. అదేంటంటే.. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గోదావరి నీళ్లు వస్తుండే. అందరూ తాగుతుండే. కానీ ఇప్పుడు వచ్చే నీళ్లు తాగుతున్నరా.. బట్టలు ఉతకడానికి కూడా పనికిరాకుండా వస్తున్నయి. ఇది నిజమా కాదా మీరే చెప్పండి. రోడ్ల మీద సర్కిళ్లు కడ్తరు. రోడ్ల మీదనే గోడలు కడ్తున్నరు. యాక్సిడెంట్లు అయినయ్. చనిపోతరు. ఆంధ్రాలో ఉన్నపుడు బాగున్నమా, ఇప్పుడు బాగున్నమా. వరదలు వస్తున్నయ్. మంచిర్యాల మునుగుతున్నది. మంచిర్యాల మునిగే అవసరమే లేదు. తెలివితోని పని చేస్తే మంచిర్యాలలో కొంచెం భూమి కూడా వరదలకు తడవదు. తెలంగాణ వచ్చినంక మనం ఏదైతే డెవలప్ మెంట్ ఊహించినమో అదేదీ జరగలేదు. నేను ఒకటి స్పష్టంగా అడుగుత. ఈ నియోజక వర్గంలో మూడు పార్టీలు ఉన్నయ్. ఒకటే సామాజిక వర్గానికి ఎందుకు మూడు పార్టీలు చేస్తున్నరు. ఇక్కడ బీఆర్ఎస్ వ్యక్తికి ఇచ్చిన సీటు మార్చకపోతే ఇక్కడ బీఆర్ఎస్ కు స్థానమే ఉండదు. సర్వే చేపిస్తరు. 20 పర్సెంటోళ్లకు టికెట్ ఇస్తరు, 50 పర్సంట్ వాళ్లకు టికెట్ ఇవ్వరు. నేనేం చేయాలే. మీ ఉద్దేశం ఏంది" అని ప్రశ్నించారు.

# పరకాల లో పాగా వేసేందుకు వ్యూహం

**వరంగల్, ఆగస్టు 29:**

పరకాల నియోజకవర్గంలో పాగా వేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్. ఈసారి ఇక్కడ పార్టీని గెలిపించి తన పంతం నెగ్గించుకోవాలని కసిగా ఉన్నారాయన. బీఆర్ఎస్ సిట్టింగ్ చల్లా ధర్మారెడ్డికి చెక్ పెట్టేందుకు కొత్త అభ్యర్థిని బరిలో దింపడానికి గ్రౌండ్ ప్రిపేర్ అయిపోయినట్టు తెలిసింది. స్థానికంగా పేరున్న డాక్టర్ కాళిప్రసాద్ బీజేపీకి దగ్గరయ్యారు. స్థానికుడైన కాళీప్రసాద్ వైద్యవృత్తితో నియోజకవర్గ ప్రజలకు చిర పరిచితుడే. పైగా సత్సంబంధాలు కూడా ఉన్నాయి. ఇది పార్టీకి ప్లస్ అవుతుందని భావిస్తున్నారట ఈటల. హుజురాబాద్ ఉప ఎన్నిక సమయంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఈటల ఓటమికోసం విశ్వప్రయత్నాలు చేశారనే ప్రచారం ఉంది. ఈసారి దీటైన అభ్యర్థిగా కాళీ ప్రసాద్‌ను రంగంలోకి దింపి రివెంజ్ తీర్చుకోవాలనుకుంటున్నారట ఈటల. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి సైతం కాళీప్రసాద్ రాకను స్వాగతిస్తున్నారు. తన ఇమేజికి తోడు పరకాల పట్టణంలో బీజేపీకి మంచి పట్టు ఉండడంతోపాటు, బడుగు బలహీనవర్గాల ఓట్లు ఎక్కువగా ఉండడం కలిసి వస్తుందని లెక్కలేసుకుంటున్నారట కాళీ ప్రసాద్. మున్నూరు కాపు అయిన డాక్టర్‌కు కొండా సురేఖ-మురళీ దంపతుల సహకారం సైతం అందుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కొండా దంపతులకు రాజకీయ ప్రత్యర్థి అయిన చల్లాను ఓడించేందుకు డాక్టర్‌కు వాళ్ళ సహకారం ఉంటుందన్నది స్థానిక అంచనా. పరకాల నియోజకవర్గంలో పరకాల, నడికూడ, ఆత్మకూరు, సంగెం, దామెర మండలాలు ఉండగా ? మొత్తం ఓటర్లు 2లక్షల 11వేల 660 మంది. అందులో ప్రధానంగా బీసీ సామాజికవర్గాలకు చెందిన ఓట్లు సుమారు 60శాతం ఉన్నాయి. ముదిరాజ్‌ల ఓట్లు 31వేలు, మున్నూరు కాపుల ఓట్లు 32వేలు, గౌడ్స్ 25వేలు, యాదవులకు 22వేలు, పద్మశాలీలకు 15వేలకు పైగా ఓటు బ్యాంకు ఉంది.ఈటల రాజేందర్ మాటకు ముదిరాజ్ సామాజికవర్గం కట్టుబడి ఉంటుందని, అదే సమయంలో సొంత సామాజికవర్గమైన మున్నూరు కాపుల నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందన్న నమ్మకంతో డాక్టర్ కాళీప్రసాద్ ఉన్నారు. మొత్తం మీద అధికారికంగా ప్రకటించకున్నా? పరకాల బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ కాళీ ప్రసాద్ ఫిక్స్ అన్నది పార్టీ కేడర్ మాట. సామాజికవర్గాల సమీకరణలతో ఈసారి పోరు కూడా రసవత్తరంగా మారే అవకాశం ఉందంటున్నారు.

# సిరిసిల్ల కార్మికులకు ఫుల్ డిమాండ్

**కరీంనగర్, ఆగస్టు 29:**

ఇప్పుడు తెలంగాణ లో ఎన్నికల వాతావరణం మొదలైయింది. అధికారం కోసం పార్టీ లు పోటీ పడుతున్నాయి..గెలుపు లో ప్రచారమే కీలక పాత్ర పోషిస్తుంది.. పార్టీ జెండాల తో ప్రచారం మరింత కలర్ ఫుల్ గా కనబడుతుంది. ఇప్పుడు సిరిసిల్ల లో రాజకీయ పార్టీ ల జెండాలు, బ్యానర్స్, టీ. షర్ట్స్. ఇతర ఎన్నికల సామాగ్రి తయారువుతుంది. తక్కువ ధరకు తయారు చేస్తు సరఫరా చేస్తున్నారు. ఎన్నికల వేళ కూడా రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులందరి చూపు మళ్లీ సిరిసిల్లపైనే పడుతుంది. నిన్న మొన్నటి వరకు జాతీయ జెండాలు సిరిసిల్లలో తయారు చేసి సరఫరా చేసి జాతీయ స్థాయిలో మంచి పేరు సంపాదించుకున్న నేతన్నలు ఇప్పుడు కూడా రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల కు చెందిన జెండాలే అంటూ చర్చ కొనసాగుతుంది.ఇక సిరిసిల్లలో ఎటు చూసిన వివిధ పార్టీల జెండాలు, బ్యానర్లు, టోపిలు తయారి చేస్తున్నారు. ఇక్కడ తయారవుతున్న ఎన్నికల ప్రచార సామాగ్రిపై, 4 వేల మందికి పైగా కార్మికులకు ఉపాధి పొందుతున్నారు. సిరిసిల్లలో తయారైన ఎన్నికల ప్రచార సామాగ్రిని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తు జీవనోపాధి పొందుతున్నారు. త్వరలో తెలంగాణ జరిగే ఎన్నికల కోసం పెద్ద ఎత్తున ఆర్డర్స్ వస్తున్నాయి. ఇతర రాష్ట్రల్లో ఎన్నికలు జరిగిన ఇక్కడి నుంచే ప్రచార సామాగ్రి ని పంపిస్తున్నారు.తమిళనాడు, కర్నాటక, కేరళ, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఇప్పటికే గత కొన్నేళ్లుగా ఈ ఎన్నికల ప్రచార సామాగ్రిని సరఫరా చేస్తున్నారు. డిజిటల్ మిషన్ ఆధారంగా పార్టీ జెండాలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున ఆర్డర్స్ వచ్చాయి.అన్ని పార్టీల నాయకులు, వివిధ నియోజకవర్గాల ఎమ్మేల్యే అభ్యర్థులు గతంలో కూడా సిరిసిల్లలోనే తమ ఎన్నికల ప్రచార సామాగ్రిని తయారు చేయించుకున్నారు. అడ్వాన్స్‌గా అర్డర్లు ఇస్తు.. తమకు కావాల్సిన ఫోటోలతో కలిగిన బ్యానర్లు, కండువాలు, టోపిలు ఇతర సామాగ్రిని తయారు చేయించుకుంటున్నారు. సిరిసిల్లలో 15 మంది పైగా ఆసాములు ఈ జెండాల తయారీలో నిమగ్నమయ్యారు. సమయం లేక కొంత మంది నాయకుల అర్డర్లు సైతం తిరస్కరిస్తున్న సంఘటనలు సిరిసిల్లలో చోటు చేసుకుంటున్నాయి. నాయకులకు నచ్చిన డిజైన్లలో, ఆయా పార్టీల రంగులతో ఇవి తయారు చేస్తున్నారు. ఒక్కో వ్యాపారి వద్ద 100 మందికి పైగా మహిళలు, పురుషులు పని చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ కూలీ డబ్బులు కార్మికులు సంపాదిస్తున్నారు. కార్మికులకు కొరత ఏర్పడింది.దీంతో కూలీ రేటు తక్కువ సమాయానికి ఎక్కువ ఇస్తామనడంతో బీడీకార్మికులు బీడీలు చుట్టడం మానేసి ఈ ఎన్నికల ప్రచార సామాగ్రి తయారి కోసం వస్తున్నారు. ఆరు గంటల్లోనే రూ.300 నుంచి రూ.400 సంపాదిస్తున్నారు. కానీ ఈ సీజన్ కేవలం మూడు నెలలే ఉంటుందని బీడీ కార్మికులు పేర్కొంటున్నారు. బీడీలు చేస్తే రోజంత కష్టపడితే రూ.100 వస్తుందని, ఈ కండువాలు, బ్యానర్ల కట్టింగ్‌కు వస్తే నీడకు కూర్చోని రూ.300 పైగా సంపాదిస్తున్నమని మహిళలు పేర్కొంటున్నారు. బీడి కార్మికులకు, టైలర్లకు ఉపాధి కలుగుతుంది. ఈ రెండు నెల ల పాటు చేతి నిండ పని ఉంటుందని నేత కార్మికులు చెబుతున్నారు.. మహిళ ల కు ఎక్కువ ఉపాధి లభిస్తుందని అంటున్నారు.

# కందూరు వారి ఇంట్లో ఫ్యామిలీ డ్రామా

**నల్గోండ, ఆగస్టు 29:**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం ముమ్మరంగా దరఖాస్తులు చేసుకున్నారు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు. అయితే గతానికి భిన్నంగా ఈసారి చాలా ఆసక్తికర పరిణామాలు జరుగుతున్నాయి. ఇందులో అతి ముఖ్యమైన, అందర్నీ ఆకట్టుకుంటున్నది సీనియర్ లీడర్ జానారెడ్డి ఫ్యామిలీ డ్రామా. జానారెడ్డి వారసులు తొలిసారి ఎన్నికల తెరంగేట్రం చేయాలనుకుంటున్నారు. ఫలానా నియోజకవర్గం నుంచి మేం పోటీ చేస్తాం.. మాకూ అవకాశం కల్పించమంటూ జానారెడ్డి ఇద్దరు కొడుకులూ దరఖాస్తులు చేసుకోవడం ఆసక్తికరంగా మారింది. తొలి నుంచి నాగార్జునసాగర్ కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్నారు జానా. ఆ మధ్య జరిగిన ఉప ఎన్నికల్లో సైతం ఆయనే బరిలో నిలిచారు. కానీ.. కొద్ది రోజులుగా ఆ నియోజకవర్గంలో జానారెడ్డి రెండో కుమారుడు జైవీర్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. తండాలన్నింటిని ఇప్పటికే ఒక రౌండ్ చుట్టి వచ్చారు. టికెట్ ఆశావాహుల దరఖాస్తులో కూడా ఈసారి పార్టీ నాగార్జునసాగర్ టికెట్ తనకే ఇవ్వమని అప్లై చేశారాయన. అదే సమయంలో అక్కడ పెద్ద దిక్కుగా ఉన్న జానారెడ్డి మాత్రం అప్లై చేయలేదు. ఇక్కడే? పార్టీ వర్గాలకు తేడా కొడుతోంది. మరోవైపు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్ రెడ్డి కూడా అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయననైతే?నాగార్జునసాగర్‌తో పాటు మిర్యాలగూడ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఓ వైపు జానారెడ్డి అప్లై చేయలేదు. మరోవైపు ఆయన చేతిలో ఉన్న నియోజకవర్గం కోసం ఇద్దరు కొడుకులు చేశారు. అంటే? ఏంటీ ఫ్యామిలీ డ్రామా అన్న చర్చ జరుగుతోంది పార్టీలో. సరే? ఒకరు దరఖాస్తు చేశారంటే వేరే సంగతి. అన్నదమ్ములిద్దరూ నాగార్జున సాగర్‌ని కోట్ చేయడం ఏంటన్నది పార్టీ వర్గాలకు కూడా అంతుబట్టడం లేదట. అంటే? ఇద్దరిలో ఎవరో ఒకరికి ఇచ్చినా ఫర్లేదంటూ కలిసే దరఖాస్తు చేశారా? లేక నేనంటే నేనంటూ పోటా పోటీగా రేస్‌లోకి వచ్చారా అన్న అనుమానాలు సైతం కలుగుతున్నాయి. అదే సమయంలో జానారెడ్డి ఇక రిటైర్‌మెంట్ తీసుకున్నట్టేనా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. పెద్ద కొడుకు రఘువీర్ ఇప్పటికే మిర్యాలగూడపై కన్నేశారు. ఆయన అక్కడ బరిలో ఉంటారని ప్రచారం కూడా జరిగింది. మరి అలాంటి వ్యక్తి దాంతో పాటు సాగర్‌కి కూడా ఎందుకు దరఖాస్తు చేశారన్న ప్రశ్నకు సమాధానం ఇంకా దొరకలేదంటున్నాయి పార్టీ వర్గాలు. జానారెడ్డి ఇద్దరు కుమారులకు టిక్కెట్స్ ఇప్పించుకోగలుగుతారా? ఆయన పోటీలో లేకపోవడానికి కారణాలు ఏంటి? దానివెనక ఉన్న వ్యూహం ఏంటన్న చర్చ జోరుగా జరుగుతోంది. నల్గొండ జిల్లా రాజకీయాల్లో ఈ పరిణామం ఆసక్తిగా మారింది.

# వాలంటరీ రిటైర్మెంట్ కు దిశ అధికారి

**హైదరాబాద్, ఆగస్టు 29:**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశా ఎన్కౌంటర్ కేసు దర్యాప్తు అధికారి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడం చర్చనీయంగా మారింది. దేశవ్యాప్తంగా కీలకంగా మారిన దిశ ఘటనని షాద్‌నగర్ ఎసీపీ గా ఉండి ఇన్వెస్టిగేషన్ చేసిన సురేందర్ రాజీనామా పోలీస్ శాఖలో కలకలం రేపింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్కౌంటర్?పై దేశవ్యాప్తంగా స్పందన వచ్చింది. దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసులకు జై కొడుతూ, పూలు చల్లుతూ పెద్ద ఎత్తున పబ్లిక్ పోలీసులకు నీరాజనం పలికారు . అలాగే ఈ దిశ కేసులో తెలంగాణ పోలీసులు వ్యవహరించిన తీరుతో రాష్ట్ర పోలీసు ప్రతిష్ఠ పెరిగింది. మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం పోలీసుల పనితీరు చాలా ఆదర్శంగా ఉందంటూ అనేకమంది మెచ్చుకున్నారు. వీటన్నిటిని చూసిన అప్పటి ఆ కేసు ఇన్వెస్టిగేషన్ అధికారి తన భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని ఆశించాడు.కానీ ఆయన కష్టానికి దక్కాల్సిన ఫలితం దక్కకపోగా అంతా రివర్స్ అయింది. భరోసా నమ్మకం కల్పించాల్సిన పోలీస్ బాసుల మద్దతు దొరకపోవడంతో మౌనంగా ఉండి పోయాడు. దిశ ఎన్కౌంటర్ సమయంలో షాద్‌నగర్ ఏసిపి గా ఉన్న సురేందర్.. ఆ తర్వాత విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆ తర్వాత తిరిగి మంచి పోస్టింగ్ వస్తుందని అనుకున్నారు. కానీ సురేంద్రకు సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ ఏసీపీగా బదిలీ చేశారు. దీంతో మనస్థాపానికి గురైన సురేందర్ తాను దిశ కేసులో ఇంతగా కష్టపడితే కనీసం మంచి పోస్టింగ్ ఇవ్వరా అంటూ వైరాగ్యంతో ఆయన వీఆర్ఎస్?కి అప్లై చేసుకున్నారు. ఎమ్మెల్యేల లెటర్స్ ఉంటేనే పోస్టింగ్స్.. పొలిటికల్ లీడర్ల ఆశీస్సులు ,ఎమ్మెల్యేల లెటర్లు ఉంటేనే పోలీసులకు పోస్టింగులు వస్తున్నాయంటూ ఒకవైపు పోలీస్ శాఖ పైన పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నవేళ దిశలాంటి సీరియస్ కేస్ని ఇన్వెస్టిగేషన్ చేసిన ఒక సీనియర్ డీఎస్పీ వీఆర్ఎస్ తీసుకోవడం తెలంగాణ పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.ఇదిలా ఉండగా 2019, నవంబర్ 28న వెటర్నరి వైద్యురాలిగా పనిచేస్తున్న ఓ యువతిని నలుగురు యువకులు రేప్ చేసి హత్య చేశారు. ఆ తర్వాత ఆమెను షాద్‌నగర్‌లోని చింతన్‌పల్లి వంతెన కింద ఆమె మృతదేహాన్ని కాలబెట్టారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రంలోనే కాదు దేశవాప్తంగా దుమారం రేపింది. నిందితులను చంపేయాలంటూ అప్పుడు నెటీజన్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే సీన్ రీనకన్స్ట్రక్షన్ కోసం పోలీసులు నిందుతులను ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. ఆ సమయంలో నిందితులను పోలీసులు షూట్ చేశారు. దీంతో పోలీసుల పనితీరును ప్రజలు ప్రశంసించారు.

# జాతీయ క్రీడా దినోత్సవ చెస్ పోటీలు ప్రారంభం

**నంద్యాల**

మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ మరియు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల అధినేత మరియు జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖ నాయకులు శ్రీనాథ్ అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తమ సహకారం నిరంతరం అందజేస్తామని తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారు వచ్చే నెలలో నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టులో ఉంటారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనాథ్ మాట్లాడుతూ చదరంగం మేధోసంపత్తికి సంబంధించిన క్రీడ అని అన్నారు. చదరంగం భారతదేశంలోనే కొట్టడం భారతీయుల మేధాసంపత్తికి నిదర్శనం అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి,లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి.వీ సుధాకర్ రెడ్డి, సోమేశు ల నాగరాజు, ఉపాధ్యక్షులు కూరా ప్రసాద్, ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ , క్రీడాకారుల తల్లిదండ్రులు కోచ్ లు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ కి ఘన సన్మానం

**మెట్ పల్లి**

మెట్ పల్లి సబ్ కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దూలం మధు ని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మర్కజ్ ఇంతేజామియా కమిటీ మిల్లతే-ఎ-ఇస్లామియ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా శాలవాలతో ఘనంగా సన్మానించారు ఓ మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కజ్ ఇంతేజామియా కమిటీ మిల్లతే-ఎ-ఇస్లామియ ఈద్గా అధ్యక్షులు మహమ్మద్ షకీల్, మర్కజ్ ఇంతేజామియా కమిటీ మిల్లతే- ఎ-ఇస్లామియ ఉపాధ్యక్షులు అబ్దుల్ నయం, ఈద్గా ఉపాధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, బాబు ఖాన్ సాబ్ సాజీద్ తదితరులు పాల్గొన్నారు.



# వన్యమృగాలు ఎందుకు దారి తప్పుతున్నాయి..

**తిరుపతి, ఆగస్టు 29:**

జీవ వైవిధ్యం కలిగిన దట్టమైన అటవీ ప్రాంతం నుండి వన్యమృగాలు దారి తప్పి ఎందుకు బయటకు వస్తున్నాయి. మనుషులను చూస్తే పక్కకు జారుకునే వన్యమృగాలు చిన్నారులపైన దాడులు చేస్తున్న సందర్భాలు ఎందుకు నెలకొంటున్నాయి. ఒక్కసారి శేషాచలం అటవీ ప్రాంతంలో వన్యమృగాల సంతతి పెరగడమే దాడులకు ముఖ్య కారణమా? అసలు శేషాచలం అటవీ ప్రాంతంలో ఏం జరుగుతుంది? వన్యమృగాలు బయటకు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే ?కోట్లాది మంది ఆరాధ్యదైవమైన శ్రీనివాసుడు కొలువైయున్న తిరుమలలో ప్రస్తుతం వన్యమృగాల సంచారం అధికమైంది. గత కొద్ది రోజులుగా శేషాచలం అటవీ ప్రాంతం నుండి బయటకు వచ్చిన వన్యమృగాలు ఇటు టీటీడీని, అటు శ్రీవారి భక్తులను టెన్షన్ కు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 22వ తారీఖున అలిపిరి నడక మార్గంలో ఓ ఐదేళ్ళ బాలుడు కౌశిక్ పై దాడి చేసిన చిరుత సమీపంలోని అటవీ ప్రాంతంలోకి ఎత్తుకెళ్ళి, బాలుడుని తీవ్రంగా గాయపరిచింది. అయితే చిరుత దాడి నుండి పూర్తి బాలుడు కోలుకోవడంతో టీటీడీ, శ్రీవారి భక్తులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనను మరువక ముందే బాలుడిపై చిరుత దాడి చేసిన ఘటనకు కూతవేటు దూరంలోనే ఆరేళ్ళ బాలిక లక్షితపై దాడి చేసిన చిరుత సమీపంలోని అటవీ ప్రాంతంలోకి ఎత్తుకెళ్ళి క్రూరంగా చంపేసింది. ఈ ఘటనతో ఒక్కసారిగా టీటీడీ ఉలిక్కి పాటుకు గురైంది. శేషాచల అటవీ ప్రాంతంలో కోవిడ్ ముందు వరకు చిరుతల సంతతి తక్కువగా ఉండేది. కేవలం తిరుమల పరిసర ప్రాంతాల్లో 8 నుంచి 10 వరకు ఉన్న చిరుతల సంఖ్య ఉండేది. కోవిడ్ సమయంలో భక్తుల రద్దీ లేకపోవడం కారణంగా ఈ ప్రాంతం ఒక్కసారిగా నిర్మానుషంగా మారిన సందర్భంలో చిరుతలకు స్వేచ్ఛ లభించడంతో చిరుతలు కలయిక అధికంగా జరిగింది. దీంతో వీటి సంతతి గణనీయంగా పెరిగింది. ఇటీవల చిన్నారులపై చిరుతపులులు దాడి చేసిన ఘటన తర్వాత టీటీడీ అటవీశాఖ అధికారులు చిరుతల సంతతిపై పూర్తిస్థాయిలో ఆరా తీశారు. ఈ క్రమంలోనే తిరుమల పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం 40కు పైగానే చిరుతలు సంఖ్య ఉన్నట్టు అటవీ శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. చిరుతలతో పాటుగా, ఎలుగుబంటుల సంచారం టీటీడీని కలవర పాటుకు గురి చేస్తుంది. ఇక సాధారణంగా వర్షా కాలంలో(చిత్త కార్తీక మాసం) నెలలో చిరుతలు అధికంగా కలయిక సాగించే మాసం కావునా చిరుతలు ఒకవైపు నుండి మరోవైపుకు కలయిక సాగించేందుకు వెళ్తున్న తరుణంలో చిరుతల సంచారం అధికంగా ఉండవచ్చనే టీటీడీ అటవీ శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలోనే అలిపిరి నడక మార్గంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంకు కోతవేటు దూరంలో ఉన్న ఓ నీటి తొట్టిలో రెండు రోజుల క్రితం ఓ ఏలుగుబంటి ఉన్నట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. అయితే మత్తు మందు ఇచ్చి ఎలుగుబంటిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు సహాలవిధాలుగా ప్రయత్నం చేసినప్పటికీ అధికారుల ప్లాన్ ను చిత్తు చేస్తూ ఏలుగుబంటి తప్పించుకుంది. ఈ క్రమంలో శ్రీవారి మెట్టు మార్గంతో పాటుగా అలిపిరి నడక మార్గంలో ఎలుగుబంటులను బంధించేందుకు 100 మంది సిబ్బందిని టీటీడీ అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. దట్టమైన చెట్లతో నిండిన శేషాచల అటవీ ప్రాంతం ఎన్నో వన్యప్రాణులు, వన్యమృగాలకు ఆవాస స్థలం. తిరుపతి నుండి తిరుమలకు వెళ్లే మార్గాలలో వన్యప్రాణులు భక్తులకు కనువిందు చేస్తూ ఉంటాయి. ఇలా వన్యప్రాణులను చూసిన భక్తులు ఆనందంతో వాటికి ఆహారం తినిపించేందుకు, వాటితో ఫోటోలు దిగేందుకు ఎక్కువ ఉత్సాహం చూపిస్తుంటారు. ఈ క్రమంలోనే వన్యప్రాణులు ఆయా ప్రదేశాలలో అధికంగా తిరుగుతూ ఉండడం కారణంగా ఆ ప్రదేశాలకు వేట సాగించేందుకు చిరుతలు వస్తున్నట్లు టీటీడీ అటవీశాఖ అధికారులు గుర్తించారు. అంతే కాకుండా శేషాచలం అటవీ ప్రాంతంలో వన్యమృగాలు నీటి కొరత ఉండడం కారణంగా దాహార్తిని తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుండి బయటకు వస్తున్నాయని, అయితే నడక మార్గాలకు దూరంగా అటవీ ప్రాంతంలో చెక్ డ్యాంలను ఏర్పాటు చేయడం ద్వారా వన్యమృగాలు అక్కడే ఉండే సంచరించే అవకాశం ఉంటుందని అటవీ శాఖ నిపుణులు చెబుతున్నారు. అటవీ ప్రాంతంలో అన్ని రకాల జంతువుల సమతుల్యంగా ఉన్నప్పుడే పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది. శేషాచలంలోని చిరుతలను, ఎలుగుబంటులను ఇక్కడి నుండి తరలిస్తే, పర్యావరణ అసమతుల్యం ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిరుతల వేటలో అధికారులు అతిఉత్సాహం చూపించకుండా నడక మార్గాలకు సమీపంలోని వన్యమృగాల బంధించి వాటిని మాత్రమే మరోక ప్రాంతంలో వదిలి పెట్టాలని నిపుణులు చెబుతున్నారు.చిరుత దాడి నేపథ్యంలో తిరుమల అటవీ ప్రాంతంలోని అలిపిరి నడక మార్గంలో 300 ట్రాప్ కెమెరాలు, శ్రీవారి మెట్టు మార్గంలో యనభై ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని సిసిఎఫ్ నాగేశ్వర రావు వెల్లడించారు. అదేవిధంగా 100 మంది సిబ్బంది క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారని, మోకాళ్ళ మెట్టు, నరసింహస్వామి ఆలయం ఆవరణలో ట్రంక్ లైజింగ్ ఎక్విప్మెంట్ సిద్దంగా పెట్టుకున్నాంమని, మెట్ల మార్గంలో వంద మంది గ్రూప్ లుగా వెళ్ళాలని కోరారు. టీటీడీ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, చిరుత, ఎలుగు బంటి కూడా ఈ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నాయని, నడక మార్గంలో గణనీయంగా తగ్గిన భక్తులు సంఖ్య తగ్గిందన్నారు. లక్షితను చంపినది చిరుతనే అని నిర్ధారణ అయ్యింది. కానీ



ఇప్ఒటి వరకూ పట్టుకున్న రెండు చిరుతలో ఏది అనేది రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. ఏడో మైలు వద్ద ఒక చిరుత, ఎలుగు బంటి మాత్రమే ఉన్నట్టు కెమెరా ట్రాప్ ద్వారా తెలుస్తోందని, వైల్డ్ లైఫ్ ఇండియా వారి గైడ్ లైన్స్ ప్రకారం కంచె ఏర్పాటుపై నిర్ణయం ఉంటుందని, మహారాష్ట్ర నుంచి కొన్ని బోనులు తీసుకు వచ్చి వాటిని కొన్ని రీమోడల్ చేస్తున్నట్లు చెప్పారు. కంఫా ఫండ్స్ తో అటవీ సమీప ప్రాంతాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాంమని, జూలై నుంచి సెప్టెంబర్ వరకు జంతువులు సంపర్కం సమయం వల్ల చిరుతల కదలికలు ఎక్కువ అయ్యాయని సిసిఎఫ్ నాగేశ్వరరావు తెలియజేశారు.

# బద్వేల్ లో విచ్చలవిడిగా ఆహార పదార్థాల కల్తీ

## పత్తాలేని ఫుడ్ ఇన్స్పెక్టర్

**బద్వేలు**

బద్వేల్ లో విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు విక్రయాలు జరుగుతున్నాయి చాలా కాలంగా ఇదే పద్ధతి కొందరు వ్యాపారులు యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు కల్తీ ఆహార పదార్థాలు విక్రయించడంలో కొందరు పెద్ద వ్యాపారులు కూడా ఉండడం విశేషం వీరు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ ఆహార పదార్థాల వల్ల భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారింది. బద్వేల్ పట్టణంలో మెజార్టీ దుకాణాల్లో కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఏమాత్రం నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయించడం వల్ల వాటిని కొనుగోలు చేసిన వినియోగదారులు అటు ఆరోగ్యం ఇటు డబ్బు భారీగా నష్టపోతున్నారు.
ఇటీవల బద్వేల్ పట్టణానికి చెందిన ఐదు మంది కల్తీ ఆహార పదార్థాలు కొనుగోలు చేసి వాటిని తిన్న తర్వాత అనారోగ్యం పాలై పక్క జిల్లాలోని ఆసుపత్రిలో చేరి చికిత్సలు పొంది వేలకు వేల రూపాయలు నష్టపోయారు. ఇదంతా కల్తీ ఆహార పదార్థాలు తినడం వల్లే ఆరోగ్యం దెబ్బతిందని వారికి చికిత్స అందించిన డాక్టర్లు నిర్ధారించారు. బద్వేల్ లో కల్తీ ఆరపదార్థాలు అమ్మకాలు జరుగుతున్న విషయం సంబంధిత అధికారులకు బాగా తెలుసు అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కల్తీ ఆహార పదార్థాలు అమ్మకాలు జరక్కుండా చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎక్కడ ఉన్నారో ఎవరికి తెలియదు. కనీసం దుకాణాలు తనిఖీ చేసిన పాపాన పోలేదు. కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వారి నుండి సంబంధిత అధికారులకు సిబ్బందికి నెలవారి ముడుపులు అందుతున్నట్లు ఎప్పటినుంచో ఆరోపణలు ఉన్నాయి ఆరోపణలకు తగ్గట్టుగానే వారి వ్యవహారం ఉంది ఆహార పదార్థాలపై తయారీ తేదీ ఎండాకాలంలో లోపల వినియోగించుకోవాలి అనే కంపెనీ ముద్రలు ఉంటాయి. కానీ చాలా ఆరపదార్థాల ప్యాకెట్లపై ఇలాంటి ముద్రలు లేకపోవడం విశేషం వాటిని కొందరు వ్యాపారులు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. సుగంధ ద్రవ్యాలు నెయ్యి డాల్డా నూనె పసుపు కారం చికెన్ మసాలా తదితర ఆహార పదార్థాలలో భారీ కల్తీ జరుగుతోంది వీటిని హోల్సేల్గా కొనుగోలు చేసి పాల్తిన్ ప్యాకెట్లలో చుట్టి వినియోగ దారులకు అమ్ముతున్నారు పాలలో సైతం డిటర్జెంట్ పౌడర్ కలిపి కల్తీ చేస్తూ విక్రయాలు జరుపుతున్నారు ముఖ్యంగా నూనె వస్తువుల్లో జంతు చర్మాలు ఎముకలు బాగా శుద్ధిచేసి వాటిని నూనె రూపంలోకి వచ్చిన తర్వాత ప్యాక్ చేసి వినియోగదారులకు అంట కడుతున్నారు అందమైన ప్యాకింగ్ ఉండడంతో కల్తీ ఆహార పదార్థాలు వినియోగదారులు గుర్తించలేక పోతున్నారు.
తేనెలో చక్కర బెల్లం పాకం కలుపుతున్నారు ఐస్ క్రీమ్ లో వాషింగ్ పౌడర్కలుపుతున్నారు. ఉప్పులో శుద్ధ పొడి పండ్లపై మైనం ఉపయోగిస్తున్నారు కల్తీ ఆహార పదార్థాల అమ్మకాలపై విచారణకు కొలతలు తూనికల అధికారులు విజిలెన్స్ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. కేవలం ముడుపులకే పరిమితం అయ్యారు ఎండబెట్టిన బొప్పాయి గింజలను మిరియాలుగా మారుస్తున్నారు ఇందుకోసం బ్యాక్ ఆక్సైడ్ ను ఉపయోగిస్తున్నారు పసుపులో తౌడు టీ పొడిలో రంపంపు పొట్టు కారంపొడిలోకాల్చిన ఇటుకల పొడి గసగసాలలో గోధుమ రవ్వ చక్కెరలో బియ్యం రవ్వ కలుపుతున్నారు. ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కల్తీ ఆహార పదార్థాలు వినియోగదారులకు అంట కడుతున్నారు. ఆహార పదార్థాలు తయారు చేసేందుకు వీరికి ఇటువంటి లైసెన్సులు లేవు అయినప్పటికీ కల్తీ ఆహార పదార్థాలు తయారుచేసి వాటిని వ్యాపారులకు ఇస్తున్నారు. వీటినే కొందరు వ్యాపారులు ప్రజలకు అంట కడుతూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు కల్తీ ఆహార పదార్థాలు చౌకగా కొనుగోలు చేసి ప్రజలకు ఎక్కువ మొత్తంలో ఎకరాలు చేస్తున్నారు కల్తీ ఆహార పదార్థాలు అరికట్టే వారు లేకుండా పోయారు.

# మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయం ముట్టడి.

**రంగారెడ్డి**

మహేశ్వరం నియోజకవర్గ జిల్లెల గూడా లోని విద్యాశాఖ మంత్రి క్యాంప్ ఆఫీస్ ను ఏబీవీపీ విద్యార్థులు మంగళవారం ముట్టడించారు. దాదాపు 3500 కోట్లు స్కాలర్షిప్ పెండింగ్ ఉన్నా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించడం లేదని ఆందోళన చేపట్టారు. తెలంగాణలో ఉన్న అన్ని టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని. ఓయూలో కనీస సౌకర్యాలు లేవు టీచింగ్ నాన్ టీచింగ్ లేదు, పెండింగ్ లో ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలి , సకాలంలో విద్యార్థులకు స్కాలర్షిప్ అందించాలి. గ్రూప్ వన్ రిజల్ట్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు.. పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.

# బీసీ ల అభివృద్దిని గాలికి వదిలేసిన బీఆర్ఎస్

**కుత్బుల్లాపూర్**

భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ (జిల్లా,మండల అధ్యక్షులు) సమావేశాన్ని కొంపల్లి లోని ఏఎంఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు డా" లక్ష్మణ్.బిజెపి ఎన్నికల కమిటీ చైర్మన్,హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల నుండి దేశం గర్వించ దగ్గ స్థాయి కి వెళ్ళిన బిసి బిడ్డ నరేంద్ర మోడీ అని అన్నారు. బిసిలకు ,ఎస్సీలకు సబ్ ప్లాన్ అమలు చేసి వారి జీవితంలో వెలుగులు నింపాలని మొట్ట మొదట ప్రతిపాదన పెట్టింది బిజెపి పార్టీ అని అన్నారు. బిసి లకు న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బి అర్ ఎస్ పార్టీ వారి అభివృద్ధి ని గాలికి వదిలేసింది అని మండిపడ్డారు. అన్నిట్లో నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ...అని చెప్పే కేసీఆర్ కు నంబర్ వన్ అంటే మద్యంలో, భూ కబ్జాల్లో,లిక్కర్ స్కాం లలో,ప్రభుత్వ భూములు కొల్లగొట్టడం లో,ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేయడంలో అని మండిపడ్డారు.

# 6కోట్లాడి సాధించుకున్న తెలంగాణ..తలెత్తుకుని నిలబడాలనేదే కేసిఆర్ తపన

**వేల్పూర్**

ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన,సంక్షేమ కార్యక్రమాలు,బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ముప్కాల్ మండలం రేంజర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్,బిజెపి నాయకులు,తటస్థులు మరియు ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్ గ్రామం కాంగ్రెస్,బిజెపిల నుండి పలువురు యువకులు సుమారు 200 మంది మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ..తలెత్తుకుని నిలబడాలనేదే కేసిఆర్ తపన అని మంత్రి అన్నారు. తెలంగాణ అంతా ఒకే కుటుంబమైతే ఆ ఇంటి పెద్ద కేసిఆర్ అని,కుటుంబం ఎప్పుడూ బాగుండాలని ఇంటి పెద్ద ఆరాటపడుతడాని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు దేశంలోనే అత్యంత ఉన్నతంగా బ్రతకాలని కేసిఆర్ తపనపడుతారని గుర్తు చేశారు. హరితాహారం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 9శాతం గ్రీనరి పెరిగిందని, ఇంత పచ్చదనం పెంపు ప్రపంచంలోనే ఇదెక్కడ సాధ్యం కాలేదన్నారు. సమాజ హితం,భవిష్యత్ తరాల కోసం మాత్రమే చేపట్టిన కార్యక్రమమని,ఓట్ల కోసమో రాజకీయం కోసమో చేసింది కాదని వివరించారు. ఇంటింటికీ సురక్షిత నల్లా నీరు అందుతుందంటే దాని వెనుక కేసిఆర్ నిద్ర లేని రాత్రులు ఎన్నో ఉన్నాయని, కేవలం ఆయన అకుంఠిత దీక్ష వల్లే 3 ఏళ్లలో అది సాధ్యం అయ్యిందని అన్నారు. ప్రతీ పథకం మానవీయ కోణంలో ఆలోచించి ప్రవేశపెట్టిందే అని అన్నారు. ఒకప్పుడు నీటికి,కరెంట్ కు కటకట ఉండేదని,ఎరువుల కోసం చెప్పులు లైన్లు పెట్టిన రోజులు ఉన్నాయని గుర్తు చేశారు. నేడు కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులతో,ఎస్సారెస్పీ పునరుజ్జీవపథకం రివర్స్ పంపింగ్ ద్వారా లిఫ్ట్ ల నుండి వాగులు,చెరువులు నింపుకోవడం,చెక్ డ్యాంలు నిర్మించుకుని నీటిని ఒడిసిపట్టడంతో యాసంగిలో కూడా భూమి బీడు లేకుండా పంటలు సమృద్ధిగా పండుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం చెప్పులు లైన్లో పెట్టేదని,పోలీస్ స్టేషన్లో పెట్టి ఎరువులు అమ్మారని పాత రోజులు గుర్తు చేశారు. అట్లాంటి బాధలు అన్నీ ఇప్పుడు కేసిఆర్ దూరం చేశారని తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కేసిఆర్ లాగా మరెవరూ కనీసం ఆలోచన కూడా చేయలేరని మంత్రి స్పష్టం చేశారు. ఆనతి కాలంలోనే



తెలంగాణ రాష్ట్రాన్ని...యావత్ దేశానికే ఆదర్శంగా నిలిపారని,నేడు ఏ రంగం చూసుకున్నా తెలంగాణ నంబర్ వన్ అయ్యిందన్నారు. రైతులకు 3గంటల కరెంట్ చాలు అంటున్న చేతి గుర్తోడు(కాంగ్రెస్)...వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడతమంటున్న పువ్వు గుర్తోడు(బీజేపీ)మనకు అవసరమా అని అన్నారు. పక్కన కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 4వేల పెన్షన్ ఎందుకు ఇస్తలేదని,తెలంగాణలో ఎట్లా ఇస్తారని ప్రశ్నించారు. ఓట్లు అయితే డబ్బాల పడనీ తర్వాత చూద్దామనే నీచ వైఖరి కాంగ్రెస్ దని మండిపడ్డారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయనోల్లు.. ఇప్పుడు చందమామ తెచ్చి ఒళ్ళో పెడతాం..సూర్యున్ని కిందికి దించుతాం అంటే ప్రజలు నమ్ముతారా

# గోషామహల్ లో మంత్రి తలసాని అభివృద్ధి పనులు

**హైదరాబాద్**

గోషామహల్ నియోజకవర్గంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గోషామహల్ నియోజక వరంలోని జాంబాగ్ , బేగం బజార్ డివిజన్ లలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జాంబాగ్ లో మైనారిటీలు మంత్రిపై పూలజల్లుతూ వెల్కం చెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ చేసే హామీలన్నీ ఆచరణ సాధ్యం కానివే. ఓట్లను దండుకొనే లక్ష్యంతో అవగాహన లేకుండా హామీలు ప్రకటిస్తున్నారు. కర్ణాటక లో ఇచ్చిన హామీలు అమలు చేసి చూపెట్టండి. 50 సంవత్సరాలు పాలించారు కదా ప్రజలకు ఏం చేశారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఏ రోజు కూడా ప్రజల గురించి ఆలోచించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ కాదు. అధికారం కోసం ఏ గడ్డి అయిన తింట్టం అన్నట్టుగా..రోజుకో డిక్లరేషన్ పెట్టుకుం టున్నారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ లు మూతి తుడుచుకోవడానికి కూడా పనికి రావని అన్నారు.

# గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిని ఎంఐఎం నిర్ణయిస్తాది

**హైదరాబాద్**

గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు చేసారు. నేను సచ్చినా సెక్యులర్ పార్టీలకు వెళ్ళను. నా ప్రాణం పోయినా బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలకు పోను. తెలంగాణ ను హిందు రాష్ట్రం చేయాలని నా లక్ష్యం. బీజేపీ నాకు టికెట్ ఇవ్వకుంటే.. రాజకీయలు పక్కన పెట్టి నేను హిందు రాష్ట్రం కోసం పని చేసుకుంటానని అన్నారు. గోషామహల్ బీఆర్ఎస్ టికెట్ ఎంఐఎం చేతిలో ఉంది..అందుకే పెండింగ్ పెట్టారు. దారుసలామ్ నుంచి గోషామహల్ బీఆర్ఎస్



అభ్యర్థిని ఎంపిక చేస్తారు. నేను రాజకీయాల నుంచి తప్పుకుంటాను కానీ. .ఇండిపెండెంట్ గా కానీ వేరే పార్టీల నుంచి పోటీ చేయను. బీజేపీ అధిష్టానం నాపై సానుకూలంగా ఉంది.. సరైన సమయం చూసి నాపై సస్పెన్షన్ వేటు ఎత్తివేస్తారని అయన అన్నారు.

# నా సామిరంగ' -2024 సంక్రాంతికి థియేట్రికల్ రిలీజ్



కింగ్ నాగార్జున అక్కినేని పుట్టినరోజు సందర్భంగా అభిమానులను ఆనందపరిచే విధంగా ఆయన కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు. పలు ప్రముఖ చిత్రాలకు పనిచేసిన పాపులర్ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని మాస్ జాతరగా రూపొందుతున్న ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. రిచ్ ప్రొడక్షన్ డిజైన్, అత్యుత్తమ టెక్నికల్ స్టాండర్డ్స్ తో రూపొందనున్న ఈ సినిమాను అఫీషియల్ గా అనౌన్స్ చేశారు.

మరో బిగ్ సర్ ప్రైజ్ గా మేకర్స్ ఒక గ్లింప్స్ , ఫస్ట్-లుక్ పోస్టర్ ద్వారా సినిమా టైటిల్‌ను కూడా ప్రకటించారు. ఈ చిత్రానికి 'నా సామిరంగ' అనే క్యాచీ టైటిల్‌ని ఖరారు చేశారు. టైటిల్ వినగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది ఏఎన్ఆర్ కల్ట్ హిట్ 'సిపాయి చిన్నయ్య' లోని నా సామి రంగ అనే ఐకానిక్ సాంగ్. నాగార్జున ఫస్ట్ లుక్ పోస్టర్‌లో బీడీ తాగుతూ మాసీ హెయిర్ స్టయిల్, గడ్డంతో మాస్ అవతార్ లో కనిపించారు. టైటిల్ గ్లింప్స్ 'నా సామి రంగ' వరల్డ్ ని మనకు పరిచయం చేస్తుంది. పలాస ఫేమ్ కరుణ కుమార్ ఉ అతని గూండాల బ్యాచ్ హీరోని చంపడానికి చూస్తున్నప్పుడు.. సింబాలిక్‌గా కింగ్‌గా పరిచయం అవుతారు. ఇక నాగార్జున ఎంట్రీతో అసలు మాస్ జాతర మొదలవుతుంది. అతని పేరు వినగానే ప్రత్యర్థులు వణుకుతున్నప్పుడు అతను వారిపై దాడి చేయడం మొదలుపెడతాడు. నాగార్జున మాస్ లుక్, ఎక్స్ టార్డీనరీ స్క్రీన్ ప్రెజెన్స్ సీక్వెన్స్‌కు బలాన్ని తెచ్చింది. విజువల్స్ అత్యుత్తమంగా వున్నాయి. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పర్ఫెక్ట్ ఎలివేషన్స్ ఇస్తుంది. ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్‌తో అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

నాగార్జున కు అనేక చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లను అందించి ఆస్కార్, జాతీయ అవార్డును గెలుచుకున్న లెజెండరీ కంపోజర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. బ్లాక్ బస్టర్ రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, డైలాగ్స్ అందించారు. ఇందులో విభిన్న క్రాఫ్ట్ లలో పాపులర్ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు.

మేకర్స్ మరో సర్ ప్రైజ్ అప్‌డేట్ ఇచ్చారు. 'నా సామిరంగ' 2024 సంక్రాంతికి థియేట్రికల్ రిలీజ్ అవుతుంది. సినిమాల విడుదలకు సంక్రాంతి చాలా పెద్ద సీజన్, అలాగే ఈ పండుగకు అనేక హిట్‌లు సాధించిన నాగార్జునకు ఇది మోస్ట్ ఫేవరేట్ సీజన్. ఇది అక్కినేని అభిమానులకు నిజమైన పండుగ కానుంది. పండగ సెలవుల్లో ఫ్యామిలీ ఆడియన్స్ మొదటి ప్రాధాన్యత ఎప్పుడూ వినోదాత్మక సినిమాకే ఉంటుంది.

తారాగణం: కింగ్ నాగార్జున అక్కినేని, కరుణ కుమార్



# జవాన్' నుంచి 'నాట్ రామయ్యా వస్తావయ్యా' సాంగ్ రిలీజ్.. డాన్స్ తో దుమ్ము రేపిన షారూఖ్ ఖాన్



కింగ్ ఖాన్ షారూఖ్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'జవాన్'. హ్యూజ్ ఎక్స్ పెక్టేషన్స్ తో సెప్టెంబర్ 7న రిలీజ్ అవుతోన్న ఈ సినిమానుంచి మంగళవారం 'నాట్ రామయ్యా వస్తావ-య్యా' సాంగ్ ను మేకర్స్ విడుదల చేశారు. రీసెంట్ గా చంబనొఖీఐ సెషన్ లో షారూఖ్ తన అభిమానులతో మాట్లాడుతూ 'నాట్ రామయ్యా వస్తావ-య్యా' సాంగ్ గ్లింప్స్ ను విడుదల చేసి ఆశ్చర్యంలో ముంచెత్తారు. దీంతో మూడో సాంగ్ ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని అంరదూ ఆసక్తిగా ఎదురు చూడసాగారు. ఎట్టకేలకు ఈ నిరీక్షణకు తెరపడుతూ 'నాట్ రామయ్యా వస్తావయ్యా..' సాంగ్ విడుదలైంది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్లు 'నాట్ వస్తావయ్యా'ను అద్భుతంగా తెరకెక్కించారు. పాట చూస్తుంటే పార్టీ నెంబర్ లా ఉంది. ప్రోమోలో షారూఖ్ ఎనర్జీ, ఛార్మ్ అందరినీ ఆకట్టుకుంది. ఇప్పుడు సాంగ్ లో అది రెట్టింపుగా కనిపిస్తుంది. డాన్స్ మూవ్స్ ట్రెండ్ సెట్టింగ్ గా ఉన్నాయి. పాటను హిందీ, తెలుగు, తమిళ భాషల్లో మేకర్స్ విడుదల చేశారు. సాంగ్ పార్టీ వైబ్స్ తో అలరిస్తుంది.

హిందీ వెర్షన్ లో 'నాట్ రామయ్యా వస్తావయ్యా' పాటకు అనిరుద్ రవిచందర్ సంగీతాన్ని అందించారు. పాటకు కుమార్ సాహిత్యాన్ని అందించారు. అనిరుద్, విశాల్ డడ్లాని, శిల్పా రావు పాటను తమదైన స్టైల్లో అద్భుతంగా ఆలపించారు. వైభవ్ మర్చంట్ పాటకు కొరియోగ్రఫీని అందించారు. తెలుగు వెర్షన్ పాటను ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ రాయగా శ్రీరామచంద్ర, రక్షిత సురేష్, అనిరుద్ పాడారు. ఇక తమిళ వెర్షన్ సాంగ్ కు వివేక్ సాహిత్యాన్ని అందించారు. అనిరుద్, శ్రీరామ్ చంద్ర, రక్షిత సురేష్ పాటను పాడారు.

షారూఖ్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న 'జవాన్' చిత్రాన్ని రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మిస్తున్నారు.

# పారంభమైన రాకింగ్ రాకేష్ కొత్త చిత్రం




గ్రీన్ టీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ పతాకంపై గరుడవేగ మేకింగ్స్ ప్రొడక్షన్ నెంబర్ 1 ఈ రోజు పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైయింది. 'జబర్దస్త్' షో తో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రాకింగ్ రాకేష్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. గరుడవేగ లాంటి ఎన్నో అద్భుతమైన చిత్రాలకు డీవోపీ గా పని చేసిన అంజి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అనన్య హీరోయిన్ గా నటిస్తోంది.

ఈ చిత్రం లాంచింగ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. తెలంగాణ ఎంపీ (రాజ్యసభ) సంతోష్ కుమార్ క్లాప్ కొట్టారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా సెల్వమణి కెమరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి తనికెళ్ళ భరణి గౌరవ దర్శకత్వం వహించగా సాయి కుమార్ మేకర్స్ కి స్క్రిప్ట్ అందజేశారు.

చిత్ర ప్రారంభోత్సవంలో తెలంగాణ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో ఫౌండర్ రాఘువ, విఎన్ ఆదిత్య, ప్రవీణ, అనిల్ కడియాల, ధనరాజ్, తాగుబోతు రమేష్, అదిరే అభి తదితరులు పాల్గొన్నారు.

లాంచింగ్ ఈవెంట్ లో ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రాకేష్ కి ఆల్ ది వెరీ బెస్ట్. తను ఇంకెన్నో చిత్రాలు చేయాలి. మంచి నటుడిగా, నిర్మాతగా గా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. చిత్ర యూనిట్ కు ఆల్ ది బెస్ట్" తెలిపారు.

మంత్రి రోజా సెల్వమణి మాట్లాడుతూ.. రాకేష్ నా కొడుకు లాంటివాడు. ఎప్పటి నుంచో తనకి లీడ్ రోల్ చేయాలని వుంది. ఈ సినిమాతో అది నెరవేరుతోంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించి మరెన్నో సినిమాలు చేసి ప్రజలకు ఆనందాన్ని పంచాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను.

తనికెళ్ళ భరణి మాట్లాడుతూ.. రాకేష్ ప్రతిభావంతుడు. హీరోగా, నిర్మాతగా ప్రయాణం మొదలుపెట్టడం అనందంగా వుంది. రాకేష్ మా గురువు గారు రాళ్ళపల్లి గారి కూడా ఇష్టమైన శిష్యుడు. చిన్న సినిమాలు పెద్దగా అవుతున్నాయి. ఈ సినిమా కూడా పెద్ద విజయం సాధించి రాకేష్ మరో పది సినిమాకు చేసే స్థాయికి రావాలని కోరుకుంటున్నాను. బిక్షపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాకేష్ బుల్లితెరపై ఇప్పటికే పాపులర్ . ఈ సినిమాతో ప్రజలకు వినోదం పంచె చిత్రాన్ని అందిస్తాడని ఆశిస్తున్నాను" అన్నారు.

ఈ చిత్రాన్ని ఒక పల్లె మట్టివాసన తెలిసే సినిమాగా రూపొందిస్తున్నామని యూనిట్ తెలిపింది.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950